"బ్రహ్మమొక్కటే" గ్రంథమాల

# శ్రీ నారాయణగురు


*రచయిత*

**జల్లి శ్రీరఘుపతిరావు**



*ప్రచురణ*

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2014**

## SRI NARAYANAGURU

*By*
**Jalli Sri Raghupati Rao**

*Editor-in-Chief*
**Prof. RAVVA SRI HARI**

T.T.D. Religious Publications Series No. 1071
© All Rights Reserved

*First Edition* - 2014

Copies : 3000

*Published by :*
**M.G. Gopal I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-In-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati - 517 507

# ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతో పాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖలను చిత్రించే గ్రంథాలను వ్రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగారు రచించిన **"శ్రీ నారాయణగురు"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ప్రస్తావన

కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీనారాయణగురువు చేసినసేవ భారతీయ సమాజం మొత్తాన్ని ప్రభావితం చేసిందని చెప్పవచ్చు.

సమాజ నిర్మాణమునకు పునాది దేశసంస్కృతి. సంస్కృతిలో సంప్రదాయం, ఆధ్యాత్మికం, మతం, జీవనవిధానం, సాహిత్యాది కళలు ప్రధాన అంగాలు. ఆధ్యాత్మికత అంతరంగానికి చెందింది. మతం విశ్వాస ప్రధానం. ఆరాధన అందులో భాగం.

'సంస్కృతి' శబ్దంలోనే సంస్కరింపబడేది అనే అర్థం ఉంది. ఎప్పటికప్పుడు సంస్కరింపబడకపోతే సమాజం స్వేచ్ఛ కోల్పోతుంది. బంధిత మవుతుంది. సంక్షుభితమవుతుంది. లోలోన క్షీణిస్తుంది. కేరళ సమాజంలో సంభవించిన ఈ స్థితిని ప్రక్షాళన చేయడానికి 19వ శతాబ్దంలో శ్రీనారాయణ గురువు పూనుకున్నాడు. మత సాంస్కృతిక సంస్కరణలతో మొదలుపెట్టి, ఆయన సామాజిక సంస్కరణలను, ఆర్థిక ప్రగతిని సాధించాడు. సాంఘిక సమానత్వం, విద్యావికాసం అస్పృశ్యతానిర్మూలనం, ఆత్మగౌరవరక్షణ, ఆధ్యాత్మిక ఉన్నతి, నిశ్చల మానసిక స్థితి సాధించడానికి జీవితాంతం కృషి సల్పాడు.

శ్రీనారాయణగురువు సేవలు దేశవ్యాప్తంగా కొనియాడబడినాయి. ఆయన స్థాపించిన ఆలయాలు, ఆధ్యాత్మికసంస్థలు, పాఠశాలలు, పారిశ్రామిక కేంద్రాలు ఇప్పటికీ పనిచేస్తున్నాయి, శ్రీస్వామివారి ధార్మిక ఆర్థిక సామాజిక ధర్మనిరతికి అవి సజీవనిదర్శనాలు. జాతిపిత మహాత్మాగాంధీ, విశ్వకవి రవీంద్రుడు గురుసేవాకేంద్రమైన వర్కలికి వెళ్ళి, గురుస్వామిని దర్శించారు.

భారతదేశాన ప్రసిద్ధి చెందిన మహానీయులెందరో వారి సేవలను ప్రశంసించారు. ఆయన భారతజాతి మొత్తానికి ఆదర్శపురుషుడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

అట్టి మహాపురుషుని జీవిత విశేషాలు, సేవా కార్యాలు నేటి యువతీ యువకులకు ఎరుకపరచడం ఎంతో ప్రయోజనకరం.

శ్రీ గురువు స్థాపించిన "శ్రీ నారాయణ ధర్మపరిపాలనాయోగం" (SNDPY) మహోన్నత మార్గదర్శి గౌతమబుద్ధుని భిక్షుసంఘమును అనుసరించి ఏర్పడిందంటే వారి ఆదర్శపుటౌన్నత్యం ఎట్టిదో ద్యోతక మవుతుంది.

సేవాపరాయణులైన శ్రీ నారాయణగురు, శంకరాద్వైత వియద్గంగను భూమిపై ప్రవహింపజేసి సామాన్య జన హృదయమనే మాగాణంలో సదాచరణతత్త్వ జలంగా ప్రవహింపజేసి, ఆధునిక ఆధ్యాత్మిక భగీరథుడుగా శాశ్వత కీర్తిని ఆర్జించాడు.

సామాన్యమైన దిగువ తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన అసామాన్యమైన మానవతామూర్తిగా, గురుప్రముఖుడుగా నిలిచిపోయాడు. అందరికీ అనుసరణీయుడనిపించు కున్నాడు. ఈ మహనీయుని రేఖామాత్ర చరిత్ర ఇది.

# శ్రీ నారాయణ గురు

## పుట్టుక - పెంపకం

శ్రీనారాయణ గురువు కేరళ రాష్ట్రంలో "చెంపళంతి" గ్రామంలో 1856 ఆగస్టు 26న, శతభిష నక్షత్రాన పశువులపాకలో జన్మించాడు. తండ్రి పేరు మదన్ అసన్, తల్లి పేరు కుట్టి. ముద్దుగా బొద్దుగా ఉన్న ఈ బాలుణ్ణి 'నానూ' అని అందరూ ప్రేమగా పిలిచేవారు. నానూ తాత కొచన్ అసన్. గొప్ప సమన్వయ కర్తగా, ఆధ్యాత్మిక అనువర్తిగా, ఆదర్శమూర్తిగా పేరు గాంచాడు. కొచన్ అసన్ అచ్చట ఒక ఆలయ ప్రతిష్ఠ చేశాడు. అందులో నాయర్లు, యెజువాలు (ఎళువలు) కలిసి ఆరాధన జరుపుకొనేవారు. నానూ కూడ తాత అంతటివాడు అవుతాడని భావించారు. చెంపాజెంది అనేగ్రామం అప్పటి మలబార్ రాష్ట్రంలో ఉంది. త్రివేంద్రంకు ఉత్తరాన సుమారు 12 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈపల్లె చుట్టూ ఉన్న దట్టమైన అరణ్యం వేటకు ప్రసిద్ధి చెందింది. మరోపక్క పచ్చని పంటపొలాలున్నవి. ఆ గ్రామంలో ప్రధానంగా నాయర్లు, ఎళువలు, పులయులు ఇంకా అనేక ఇతర కులాల వారు నివసించేవారు. వారు అరణ్యంలోని జంతుజాలాన్ని వేటాడుతూ భయంకర దురాచారాలను అనుసరించేవాళ్లు.

## సాంఘిక పరిస్థితులు

"నానూ"ది ఎళువ కులం, యజువ అని కూడ అంటారు. అది గీతకార్మికుల కులం. అప్పట్లో అది అస్పృశ్యతకు లోనైన కులం. ఎళువాలు బ్రాహ్మణులకు 32 అడుగుల దూరానికి మించి మసలుకోవాలి. అంతకన్నా దగ్గరలో తిరిగితే బ్రాహ్మణులు మైల పాటించే వారు, ఎళువలకు బహిష్కరణ విధించేవారు.

నానూ చురుకైన వాడు. ప్రశ్నపరంపరలు కురిపించేవాడు. తానెవరు, తనచుట్టు ఉన్న సమాజం తీరేమిటి, చావు పుట్టుకల రహస్యమేమిటి, తన కర్తవ్యమేమిటి అనే ప్రశ్నలు ఆయనలో తలెత్తేవి. వాటి సమాధానానికై మౌనముద్ర వహించేవాడు. ఈ ప్రశ్నలవర్షం ఆరేళ్ళ వయస్సులోనే మొదలైంది. పొట్టకు ఆకలి తీరాలి, మెదడుకు సమాధానం చిక్కాలి. ఇవి సహజ లక్షణాలు. ఈ రెండూ నెరవేరినప్పుడు మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగ గలడు. ప్రశ్నించుట హేతుభావనలో భాగం, శాస్త్రీయ వైజ్ఞానిక విధానం. హేతుబుద్ధి గల ఏ బిడ్డకైనా విద్య వివేకాన్నిస్తుంది.

చాలాకాలం ముందు నుంచీ తిరువాన్కూర్ రాష్ట్రంలో దారుణమైన దురాచారాలు వ్యాపించి ఉండేవి. నాయర్లకు ఎళువలకు వెండి బంగారు నగలు ధరించే స్వేచ్ఛ లేదు; అనుమానితునికి శిక్ష, కాగుతున్న నేతిలో ముంజేతిని ముంచటం. ఆ తీర్పు చట్టరీత్యా రద్దు అయినా దురాచారం రద్దు అయ్యేది కాదు. దిగువ కులాల స్త్రీలకు శరీరంపైభాగం కప్పుకునే హక్కులేదు. స్త్రీలు చాలాఅరుదుగా తమ స్తనాలు కప్పు కొనేవారు. యెళువలు చెప్పులు వాడడానికి లేదు. తెల్లకాగితంపై రాయడానికి లేదు. తాటాకు పై రాయాల్సిందే. కేరళ హైందవ పురుషులు తలపై నాలుగు పిలకలు పెట్టుకొనే వారు. పురుషులకు చొక్కాలే లేవు. కాళికాలయంలో పురుషులు పాటలు పాడుతూ నృత్యం చేసేవారు. ఇక జంతుబలులు సర్వసామాన్యం.

నాలుగు వర్ణాలవారు కులవంతులు, మిగతావారు కులహీనులు. అలాగే యెళువాలు కులహీనులు. నాయర్లనేవారు శూద్ర కులస్థులు. వారు నంబూద్రులను ముట్టుకుంటే నంబూద్రి స్నానం చేయాల్సిందే. కులహీనులు నడిరోడ్డు మీద నడవడం మహానేరం. చట్టనిబంధన కన్నా సంఘ నిబంధన బలీయమైంది. కులహీనులు రోడ్డుపై నడిచేటప్పుడు విచిత్ర శబ్దం చేయాలి. కులహీనుడు దీపారాధనకు నూనె ఇవ్వాల్సివస్తే, నేరుగా ఇవ్వరాదు.



పులయులు, పరియులు సైతం ఎళువాలను ముట్టుకుంటే మైలదోషం పాటించేవారు. అగ్రకులస్థులతో పాటు అధమ కులస్థులు విధినిషేధాల పట్ల ఒకే భావం కల్గి ఉండే వారు. అస్పృశ్యత నేరమనే భావనే లేదు. కులహైందవులకు మాత్రమే అన్ని అవకాశాలుండేవి.

## 'నానూ" ప్రవృత్తి

నానూ మంచి బాలుడు, మరీ ఉత్సాహవంతుడు, స్వేచ్ఛా ప్రియుడు, ఆలోచనా పరుడు. అల్లరి చిల్లరగా ఉండడుగానీ. కొన్ని పనులు కావలసి చేసేవాడు. దేవునికి నైవేద్యం చేస్తే, ముందుగా తాను తినేసేవాడు. వాళ్లూ, వీళ్లూ అనే తేడా లేకుండా అందర్నీ ముట్టుకొని కలగలుపుగా తిరిగేవాడు. ఛాదస్తం అంటే గిట్టేది కాదు. అయిదు సంవత్సరాల వయస్సులోనే అందర్నీ కలుపుకుంటూ, స్పర్శిస్తూ తిరిగేవాడు. శైశవంలో నానూ ఏడ్చి ఎరుగడట, చాలా నెమ్మదిగా ఉండేవాడట. ఒంటరిగా ఉండటానికి, నీలాకాశం వీక్షించటానికి, వనాల నడుమ తిరగడానికి ఇష్టపడేవాడు.

## చదువు - సంధ్య

నానూ చదువుల్లో చురుకుగా, ఆటల్లో ఆసక్తిగా ఉండేవాడు. ఏకాంతం కోరి ఏ చెట్టు నీడలోనో ఏ కొమ్మ మీదనో కూర్చొనేవాడు. నానూ తన పాఠ్యపుస్తకాలనే గాక ఇతిహాసాలను, వైద్య గ్రంథాలను, వేదాంత శాస్త్రాలను ఇష్టం కొద్దీ చదివేవాడు. తన మేనమామ ఆయుర్వేద వైద్య నిపుణుడు, స్థానికంగా ప్రసిద్ధుడు, అయిన కృష్ణన్ వైద్యార్‌తో చర్చించేవాడు. స్వయంగా సంస్కృతి విషయాల్లో, భాష నేర్చుకొనడంలో, ధ్యానం చేయడంలో కాలం గడిపేవాడు. బంధువుల ఇళ్ళకు ఇష్టంగా వెళ్తుండే వాడు. ఒకమారు నానూకు జ్వరం వచ్చింది, ఆటలమ్మ సోకింది. ఒక పాత గుడికి వెళ్లాడు. అక్కడికి

మనుషులు ఎక్కువగా వెళ్ళే వారు కాదు. అందులో 18 రోజులు గడిపాడు. దూరానగల బంధువుల ఇంటికి వెళ్ళి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. వ్యాధి ఉపశమింపగా 19వ రోజున ఇంటికి తిరిగివచ్చాడు. ముఖాన మచ్చలు గమనించి కృష్ణన్ వైద్యార్ "ఎవరు చికిత్స చేశారు" అని ప్రశ్నించాడు. దేవతాఅమ్మవారు అని సమాధానం చెప్పాడు. వైద్యార్ అవాక్కయి పోయాడు. ఇతను సామాన్య బాలుడు కాదని ఆశ్చర్యచకితుడయ్యాడు.

నానూకు ఉన్నత విద్య నేర్పించాలనుకున్నాడు కృష్ణన్ వైద్యార్. అతనికి కుమ్మంపిల్లి ఊరులో తెలిసిన ఉపాధ్యాయుడున్నాడు. అతని పేరు రామన్ పిళ్లై అసన్. అతడు ట్రావెంకూరులో అనేక విధాల ప్రసిద్ధుడు. కథకళి నృత్య ప్రదర్శకుడు, సంస్కృత పండితుడు, జ్యోతిష శాస్త్రజ్ఞుడు, వైద్యవేత్త, వేదాంతి, బహుగ్రంథ రచయిత. ఋషిలాగ జీవితం గడుపుతున్నాడు. అతని వద్దకు నానూ చేరాడు. నానూ వరణపల్లిలో ఉంటూ, చదువు నేర్చుకోడానికి కుమ్మంపల్లికి వెళ్తుండేవాడు.

రామన్ పిళ్లై అసన్ నానూలో అద్వైత సిద్ధాంతాసక్తి కల్గించాడు. అప్పటికే అతని వద్ద 60 మంది విద్యార్థులున్నారు. పిళ్లైపండితునికి నానూ ప్రియశిష్యుడైనాడు. గురువు చెప్పినవి, చెప్పనివి కూడ నానూ అధ్యయనం చేశాడు. రఘువంశంలోని శ్లోకాలను కంఠస్థం చేయడమే కాదు, అర్థవంతంగా చదివేవాడు. క్లాసులో నానూ నాయకుడు అయ్యాడు. అతడ్ని "నానూ చట్టంపి" అనేవారు. పిళ్లై, ఒకనాడు నానూ జన్మ నక్షత్రం, మాసం అడిగి తెలుసుకున్నాడు. ఏవో లెక్కలు గట్టి "నీది సామాన్యజన్మ కాదు, గొప్ప చారిత్రక పురుషుడవు అవుతావు. నీకు వేదాంతం నేర్పుతాను" అన్నాడు. నానూ అమితానందం చెందాడు.



## తాత్త్విక చింతన

నానూ ప్రతిదినం సూర్యోదయదర్శనం, సూర్యాస్తమయ దర్శనం చేస్తుండేవాడు. ప్రతిదినం ఉదయాన్నే నడవడం అలవాటు చేసుకున్నాడు. దైవప్రార్థన చేసేవాడు. కృష్ణుడు అప్పట్లో అతని అభిమానదైవం. ప్రతిదినం భాగవతం చదివేవాడు.

ధ్యానతత్పరుడైన నానూకి స్వతంత్రభావ వ్యక్తీకరణ అలవడింది. అధ్యయనం - పరిశీలనం - ధ్యానం - వ్యక్తీకరణం చేయడం సహజ ప్రక్రియలైనాయి, అతని ప్రతిభకు తోడ్పడ్డాయి.

వరణపల్లి యళువ వసతి గృహంలో చేరేవరకు నానూ మాంసాహారి. ఆ పిదప మాంసాహారం వర్జించాడు. అక్కడ రెండు పెంపుడు కుక్కలు ఉండేవి. ఒకటి బలమైంది. రెండవది బలహీనమైంది. నానూ రెండో దానికి ప్రత్యేకంగా ఆహారం పెట్టేవాడు. బలమైనది దౌర్జన్యంగా ఆ ఆహారాన్ని తినేది. నానూ మౌనంగా గమనించి, "మనుషులు కూడా ఇలా బ్రతకాల్సిందేనా" అని చింతించేవాడు. అస్పృశ్యుల్లో తక్కువ కులానికి చెందిన పశువులకాపరి పులయాతో నానూ స్నేహం చేశాడు. నానూ అతని ఇంటికి వెళ్లాడు. అతడు కుష్ఠు వ్యాధిగ్రస్తుడు. అతనికి నానూ బట్టలు, నూనె తీసుకుని వెళ్లాడు. నానూను చూసి పులయ భయపడిపోయాడు. ఇతరులు దండిస్తారని చెప్పాడు. పులయకు నానూ ధైర్యం చెప్పాడు. "సమాజంలో ఈ వ్యత్యాసం ఎందు కొచ్చింది? జంతువుల్లాగా బలవంతులైన వాళ్ళు. బలహీనుల్ని దోచుకోవడం వల్లనా? మనుషులు మంచి వాళ్ళుగానే కనబడుతున్నారు. అయితే ఈ విభేదాలు ఎవరు సృష్టించారు? మనిషే సృష్టించాడు, దేవుడు కాదు. ఈ ఆచార వ్యవహారాలు దుర్మార్గంగా ఉన్నాయి. అవి మనుషుల్ని రాక్షసులుగా తయారు చేస్తున్నాయి" అని నానూ మిక్కిలి బాధపడ్డాడు. సమాజంలో మనిషి అజ్ఞానం వల్ల విభేదాలు పాటిస్తున్నాడు.

విభజనలు అంగీకరిస్తున్నాడు, బలహీనుల్ని దోచుకుంటున్నాడు. పశువులా ప్రవర్తిస్తున్నాడు. మరి పులయ (చాతన్) పడే భయం భ్రమయేనా, బాధ కూడ భ్రమయేనా? అతని పేదరికం భ్రమయేనా? తెలివితేటలు ఉన్న మనిషి పాటించే ఆచారాలు కూడా భ్రమయేనా? తెలిసీ తెలియక జరుగుతుందా? కాదు, మానసిక స్థితిలో ఏదో దోషముంది. ఇది అజ్ఞాన జనిత దోషం. అజ్ఞానం తొలిగితే, మనిషి బాగుపడడమేగాక సుఖాల వెంపర్లాట మానుకుంటాడు. చెడు సంప్రదాయాలు మానేస్తాడు. ఈ విధమైన ఆలోచనలు నానూను చుట్టుముట్టాయి.

నానూ అంతర్ముఖుడై నాడు. లోక వ్యవహారాల నుండి దూరం కావాలనే తపన మొదలైంది. అయితే పులయ లాంటి మనిషి పడే వేదనలు ఎలా తొలగుతాయి అనే ప్రశ్న వేధిస్తోంది. తనకు లభించిన వేదాంత గ్రంథాలన్నీ చదివాడు. జ్ఞాన తృష్ణ పెరిగింది కానీ సమాధానం చిక్కలేదు. అలా దాదాపు మూడేళ్ళు రామన్ పండితుని వద్ద శిష్యరికం చేస్తూ విద్యాభ్యాసం చేశాడు. అసలైన శిష్యరికం అంటే నేర్చుకోవడం, స్వేచ్ఛ పొందడం, సత్యం గ్రహించడం, బాధ్యత వహించడం, సక్రమంగా ఉండటం. కేవలం నియమ నిబంధనల శిక్షణ, విధి నిషేధాల పాటింపు శిష్యరికమనుకుంటే సత్యస్ఫురణ అబ్బదు. నానూ నిజమైన శిష్యుడనిపించుకున్నాడు.

ఇంతలో నానూకు తీవ్రమైన అస్వస్థత కలగడంతో అతన్ని స్వగ్రామమైన చెంపాజెందికి తీసుకొని వెళ్లారు. కృష్ణ వైద్యార్ కనుసన్నల్లో చికిత్స పొంది కోలుకొన్నాడు. అయితే పుదుప్పల్లికి తిరిగి వెళ్లాలన్న ఆకాంక్ష అతనికి కలగలేదు. గాఢమైన సత్యాన్వేషణలో పడ్డాడు.

## ఉపాధ్యాయ వృత్తి

నానూలో వచ్చిన మార్పును పసిగట్టారు పెద్దలు. ధ్యానాదులు మాన్పించి, అతన్ని తమలో నిలుపుకోవాలని పూనుకున్నారు. అందుకు



రెండు మార్గాలు అనుసరించాలనుకొన్నారు. ఒకటి నానూకు ఉపాధ్యాయ వృత్తి కల్పించడం, రెండు పెండ్లి జేయడం. ఈ పథకం ప్రకారం పాఠశాల నిర్మించి, యళువా పిల్లలకు పాఠాలు చెప్పమన్నారు. పాఠశాలను బాగా నిర్వహిస్తు యళువా పిల్లలకు చదువు చెపుతూ, ఇళ్లకు వెళ్లి, దిగువ వర్గాల వారి ఇళ్లకు వెళ్లి, వారి పిల్లలకు చదువు చెప్తుండే వాడు. వాళ్ళ ఆరోగ్యానికి, ఇళ్ల పారిశుద్ధ్యానికి పాటించాల్సిన విధానాలు బోధించేవాడు. చుట్టు ప్రక్కల గ్రామాలలో తిరుగుతుండేవాడు. అక్కడ నుండి అరణ్యంలోకి వెళ్ళి దీర్ఘకాలం గడుపుతుండేవాడు. నానూ, కుల నియమాలు పాటించడం లేదనీ, కడగట్టు వారితో కలిసిపోతున్నాడనీ, పులయుల ఇళ్లల్లో తిరుగుతున్నాడనీ పెద్దలు తమ అభ్యంతరాలు వెలిబుచ్చారు. నానూ ప్రసన్నంగా హేతుబద్ధంగా న్యాయపరంగా సమాధానం చెప్పి, తన పని తాను చేసుకొనేవాడు.

## వివాహ బంధం

అంచుతెంగు గ్రామం స్కూలులో ఉపాధ్యాయుడు కావలసి వచ్చాడు. స్కూలు యాజమాన్యం నానూను కోరింది. నానూ వెంటనే అంగీకరించాడు. వెంటనే సమ్మతించడంలో ఏదేని విషయమున్నదేమోనని కొందరు పెద్దలు సందేహించారు. వేరే ఊరు వెళ్లడం వల్ల వాళ్ల కళ్లముందు పులయులతో కలవడం తప్పిపోయిందని తృప్తి పడ్డారు. నానూ అంచుతెంగులో మేనత్త ఇంట్లో చేరాడు. ఆ ఇంట్లో పెళ్లి కావలసిన అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి నానూ పరస్పరం ఇష్టపడితే బాగుండునని పెద్దలు భావించారు. నానూకు అదేమీ పట్టలేదు. బడి, ధ్యానం, ఆలయం ఈ మూడింటికి పరిమిత మయ్యాడు నానూ. ఆ అమ్మాయికి నానూకు మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడలేదు. అయినప్పటికీ వారికి పెళ్ళి ఏర్పాటు చేశారు. మలయాళ సంప్రదాయంలో వధూవరుల సమ్మతితో పనిలేదు. పెళ్ళి కార్యంలో పెళ్ళికొడుకు తప్పనిసరిగా ఉండాలని లేదు. పెద్దవాళ్ళు పెళ్ళికూతురు ఇంటికి

వెళ్లారు. వరుని సోదరి, వధువుకు బట్టలు పెట్టింది. ఆమెను తనవెంట తీసుకొచ్చింది, అంతటితో పెళ్ళి అయిపోయింది.

## గృహపరిత్యాగం

నానూ తన పెళ్ళి గురించి పెద్దగా పట్టించుకోలేదు. ప్రాపంచికబంధాల నుంచి బయట పడాలని అతని మనసు తహతహలాడుతోంది. ఈ పెళ్ళి బంధం కూడ అలాగే తొలగిపోతుందనుకున్నాడు. సంప్రదాయం ప్రకారం పెళ్ళి కొడుకు పెళ్ళి కూతురింటికి వెళ్ళనే లేదు. రెండు నెలలు కాగానే ఒక నాయీ బ్రాహ్మణుని ఒత్తిడి వల్ల, అతనితో కలిసి ఇంటికి వెళ్లాడు నానూ. ఇంటి ముందు అరుగుమీద కూర్చున్నాడు. పెళ్ళికూతురు కొన్ని తినుబండారాలు తెచ్చి అతని వద్ద పెట్టింది. నానూ ఇంట్లోకి వెళ్ళి కొన్ని అరటిపళ్ళు తెచ్చాడు. మిత్రుడు తానూ తిన్నారు. ఇంటిలోని వారితో ఇలా అన్నాడు. "ప్రపంచంలో ప్రతిమనిషికి ఒక ఖచ్చితమైన ఉద్దేశ్యం ఉంటుంది. మీవి మీకున్నాయి. నాది నాకున్నది" అని చెపుతూ బయటకి వెళ్ళిపోయాడు. పెళ్ళి జరిగినంత తేలిగ్గా విడాకులతంతు పూర్తి అయింది. పెళ్ళి రద్దయిపోయింది.

దాంపత్యమిచ్చే వ్యక్తిగత ఆనందాన్ని వదులుకొన్నాడు. కుటుంబమిచ్చే పరిమిత సౌఖ్యాన్ని వద్దనుకొంటున్నాడు. గ్రామమిచ్చే సామూహిక భద్రతను కాదనుకొన్నాడు. ప్రాపంచిక బంధాల పట్ల వైముఖ్యం పెంచుకొన్నాడు. ఈ తరుణంలో ఆదుకోవలసిన అతని తల్లిదండ్రులు గతించారు. ఆదుకొంటున్న మేనమామ వయోవృద్ధుడైనాడు. తన బాధ్యత, తాను చూసుకోవలసిందేనని మేనమామ నానూకు చెప్పాడు. ఇంటి బాధ్యత కూడ చూసుకోమన్నాడు. నానూ దృక్పథం వేరుగా ఉంది. నానూ స్వార్థ పూరితమైన పరిమితమైన, తాత్కాలికమైన కుటుంబబంధంలో తగుల్కొనుట కన్న తాను



అజ్ఞాన బంధాన్ని వీడి, భేదదృష్టితో బాధపడుతున్న తోటి సామాజికులకు స్వేచ్ఛ కల్పించడం శ్రేయస్కరమనుకొన్నాడు; ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు.

## ఏకాంతవాసం

ఇల్లూ వాకిలి, ఊరూ వాడ, దారీ డొంక, వనము నగము, వాగు-వంక అన్నీ దాటి దక్షిణాదికి నడిచాడు. నడిచి నడిచి అలసిపోయాడు. దాపున ఒక రాతి ఫలకం గోచరించింది. దాని ప్రక్కనే ఒక నది ప్రవహిస్తోంది. అందలి జలం స్పటికంలా ఉంది. దోసిటిలో ఉదకం తీసుకున్నాడు. ముఖంపై చల్లుకొన్నాడు. దాహం తీరా త్రాగాడు. ఉత్తేజం పొందాడు. విశ్రాంతి కోరాడు. రాతి ఫలకంపై ఆసీనుడయ్యాడు. అర్ధనిమీలిత నేత్రుడయ్యాడు కాలం, దేశం అతన్ని పీడించలేదు. నడిచిన కొద్దీ త్రోవ స్వాగతించింది. వినీలాకాశం విచ్చుకొన్నది. చల్లని చంద్రుడు వెన్నెల కురిశాడు. లతా గుల్మాలు తళతళ మెరిశాయి. చెట్లు చేమలు తలలు వంచాయి. పచ్చని ఆకులు అచ్చెరు వొందాయి. పక్షుల మోతలు ప్రోత్సహించాయి. జంతుజాలం దారినిచ్చింది. తాను ప్రకృతితో పరవశించాడో, ప్రకృతే ఆ పదగామినిగాంచి పరవశించిందో ఆ ఇరువురికే ఎరుక. ఎదురుచూస్తున్న వేగుచుక్క ప్రత్యక్షమైంది. చంద్రుడు ప్రభాతసౌందర్యరాశికి సాగిలపడి సెలవు తీసుకున్నాడు. జలజల పారే జలపాతం ముందుకు జర జర సాగిపోతూ వెనుకకు శబ్ద తరంగాలు వదిలింది. శబ్ద తరంగ హెచ్చరికలు గమనించాడు. తెలతెలవారనున్నది. రాతిఫలకం నుంచి పైకి లేచాడు, నడవసాగాడు. ఎక్కడికి? అది ఉదయసంధ్య. ముందేదో ఆలయం మసకమసకగా గోచరించింది. నాలుగు అడుగులు వేశాడు. తేరిపారచూస్తే అది సుబ్రహ్మణ్యస్వామి కోవెల. సమీపించి నిలుచున్నాడు. భక్తి తన్మయత ఆవహించింది. అతని ఏకాగ్రత, భావుకత, నిరాడంబరత, నిశ్చలత

చూపరులను కుతూహల పరిచాయి. అతని భక్తితత్పరత వారిని ఆకట్టుకొన్నది. వారికి గౌరవం ఏర్పడింది. ఏకవస్త్రధారిగా ఉన్న ఈ యువకుడు కొత్తవాడు, స్ఫురద్రూపి అని తమలో తాము అనుకొన్నారు. నిష్క్రమించారు. అతడొక్కడే అక్కడ ఆగిపోయాడు. సాయంకాలమైంది. సందర్శకులు ఫలాలు సమర్పించారు. నానూ స్వీకరించాడు చిరునవ్వుతో. వారితో సంభాషించాడు. ఆలయప్రాంగణం బాగు చేయాలి, చదును చేయాలి, మార్పు చేయాలి అన్నాడు. అలాగే అన్నారు. దరిదాపుల్లో పాఠశాల లేదని తెలిసింది. పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేయాలన్నాడు. అతడు అక్కడ ఉండి కొన్ని రోజులు గడిపాడు. భక్తులు అపుడపుడు తెచ్చిన ఆహారంతో ఆకలి తీరింది. కాని ఆత్మక్షోభ తీరలేదు. అకాంక్ష నేరవేరలేదు. ఆవేదన అలుముకొంది. అన్వేషణ సాగుతోంది.

నానూ ఒక ఉదయాన ఆలయం వదలి మళ్ళీ నడక మొదలు పెట్టాడు. ఎటు పోవాలో, ఎక్కడికి పోవాలో, ఎక్కడ ఆగిపోవాలో ఎరుకలో లేదు. గమనమొక్కటే ఉంది. అలా వెళ్తున్నాడు, వెళ్ళిపోతున్నాడు. ఆకలి అయినపుడు ఎవరు ఏది పెట్టినా తినేవాడు. ఆగి ఆగి నడిచినా అలసట తప్పడం లేదు. ఆ క్రమంలో అతనికి ఒక అనుకోని మిత్రుడు తటస్థించాడు. అతడు ఒకనాడు నానూకు సహవిద్యార్థి, సన్నిహితుడు. నానూను తన ఇంటికి రమ్మన్నాడు. నడుస్తూ నానూ తన ఆవేదనను, అనిశ్చితిని మిత్రునితో ప్రస్తావించాడు.

**శిష్యరికం**

మిత్రుడు ఇలా అన్నాడు "మనమిద్దరం కలవడం మంచిదైంది. మా ఇంటికి ఒక యోగి వచ్చియున్నాడు. అతడు పండితుడు. మహాత్ముడు నిన్ను అతనికి పరిచయం చేస్తా. ఆ యోగి పేరు "కున్హన్ పిళ్ళై చట్టంపి'



అతడు సుబ్రహ్మణ్యస్వామికి పరమభక్తుడు. అందుకే అతన్ని "షణ్ముఖదాస్' అంటారు.

నానూ, కున్హన్ సన్నిహితులయ్యారు. ఆధ్యాత్మిక విషయాలు చర్చించు కున్నారు. అందులోగల సమస్యలు, పరిష్కారాలు గురించి మాట్లాడుకున్నారు. వేదాంతంపై యోగి వెలిబుచ్చిన భావాలు నానూకు నచ్చాయి. నానూ బుద్ధికుశలత, ఆసక్తి యోగికి నచ్చాయి.

ఇరువురుకి పరస్పరం అవగాహన, అభిమానం, గౌరవం పెరిగాయి. పలాన ఆహారం, పలానచోట అనే పట్టింపు లేకుండా పెట్టింది తింటూ ఎక్కడికి పడితే అక్కడికి తిరిగారు.

నానూను షణ్ముఖదాసు తన గురువువద్దకు తీసుకొని వెళ్ళాడు. గురువు పేరు తైకాడ్ అయ్యావు. అతడు కూడ సుబ్రహ్మణ్యస్వామి భక్తుడు. అతడు త్రివేంద్రం రెసిడెన్సీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంచి యోగిగా ప్రసిద్ధి చెందాడు. నానూ అతనికి శిష్యుడయ్యాడు. యోగసాధనలో మరింత సాధన చేసి స్థిరపడ్డాడు. సాధనధ్యాసలో దక్షిణ ట్రావెన్కూరులో గల గ్రామాలన్నీ తిరిగాడు. ఆకలి భరించలేనపుడు అన్ని మతాల వారివద్ద, అన్ని కులాలవారి వద్ద ఎలాంటి వ్యత్యాసం లేకుండా ఆహారం స్వీకరించాడు. మనుషులు స్వర్గతుల్యంగా ఉండడానికి, నరకప్రాయంగా ఉండడానికి వారి వారి స్వభావాలు, వైరుధ్యమైన అభిప్రాయాలు కారణమని గ్రహించాడు. తన సాధన ద్వారా ప్రజల్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలనుకున్నాడు. కుండలినీ సాధనలో ప్రావీణ్యం జెందాడు.

ప్రజలపట్ల నానూ చూపిన శ్రద్ధ ఆశ్చర్యం కల్గిస్తుంది. అతని సానుభూతి, సంభాషణ, సమస్యల పట్ల అవగాహన, వాటిని తీర్చాలన్న ఆరాటం ఆనోట ఆనోట కొనియాడబడ్డాయి. **ప్రజలు నానూను పదే పదే "స్వామి, స్వామి" అని సంబోధించడం మొదలుపెట్టారు. అది పరిపాటి అయ్యింది.**

## గుహావాసం

నానూ స్వామిగా ప్రసిద్ధి చెందడమే గాక, మహిమలు గలవాడని ప్రచారం పొందాడు. అతడు చేసిందేమీ లేదు. రకరకాల బాధలున్న వారు అతని వద్ద తమ రోదనలు ఏకరువు పెట్టేవారు. ఆయన ఓపిగ్గా వినేవాడు. కొన్ని మాటల్తో ఓదార్చేవాడు. అలా అతనికి ఏకాంతం దెబ్బతిన్నది. ధ్యాన సమయం తగ్గిపోయింది. అయితే జనంతో మమేకమయ్యేవాడు. క్రైస్తవులు, మహమ్మదీయులు, దళితులు, యెళువాలు అన్న వ్యత్యాసం లేకుండా అందరి మధ్య తిరిగేవాడు. ఎవరు ఏం పెట్టినా తినేవాడు.కుష్ఠువ్యాధి గ్రస్థులతో కలిసి తినడానికి వెనకాడేవాడు కాదు. అప్పుడే తమిళం నేర్చుకున్నాడు. అదే సమయంలో తిరుక్కురళ్ అధ్యయనం చేశాడు.

ఒకరోజు ప్రొద్దున్నే లేచి, అరణ్యంలో ప్రవేశించాడు. నాగర్‌కోయిల్ తూర్పువైపునకు వెళ్లాడు. కొండగుహలు చేరాడు. ఆది మారుత్వామలై పర్వతారణ్యం. ఒక గుహలో ప్రవేశించాడు. ధ్యాన మగ్నుడయ్యాడు. తానూ ప్రకృతీ, ప్రపంచం ఒకటైపోయిన అనుభూతి పొందాడు. సాయంత్రం కనులు తెరిచే సరికి మసక చీకట్లు కమ్మాయి. ఆ రోజు ఆహారం లేదు. కొండగుహల్లో తిరిగాడు. ఏదో వనమూలిక దొరికింది. దాని ఆకుపసరు పిండాడు. అది ఘనీభవించింది, అతనికి ఆహారమైంది. ప్రక్కనే ఊటనీరు లభించింది. దాహం తీర్చుకున్నాడు. మళ్ళీ గుహలో చేరాడు. అక్కడే జంతుజాలం మధ్య కొంతకాలం గడిపాడు. ఆకులు, దుంపలు, కాయలే అతని ఆహారం. ఆత్మాన్వేషణ వేగం పుంజుకొంది. ప్రజల ఇబ్బందులు ఒకప్రక్క , మానసిక క్షోభ మరో ప్రక్క, సంపూర్ణ నిశ్చలత్వం పొందలేకపోవడం ఇంకో ప్రక్క ఏదో తెలియని వెలితిని గుర్తు చేశాయి. మనసంతా ధ్యానమయంగా ఉన్నా దీనజనాళిని సముద్ధరించాలన్న తపన వెంటాడుతోంది. అందు కొఱకు ఒక కార్యక్రమం సిద్ధం చేసుకోవాలి. దీర్ఘాలోచనలో మునిగి పోయాడు.



మరుత్వామలైలో ఎంతకాలమున్నాడో సరిగ్గా తెలియదుగానీ, అక్కడనుండి అరువిప్పురం గ్రామం చేరాడు.

## పేరువద్ద అరువిప్పురం

అరువిప్పురం త్రివేంద్రమునకు 12 మైళ్లదూరంలో నెయ్యార్ నదీతీరంలో ఉంది. నెయ్యత్తింకార్ పట్టణం దగ్గరలో దక్షిణ ట్రావంకూర్‌లో నెలకొని ఉంది. నదీతీరం నిర్మానుష్యం. అటూ ఇటూ దట్టమైన అడవులున్నాయి. నది ఒడ్డుకు చొచ్చుకొని వచ్చిన ఒక పెనుశిల ఉంది. అందులో మనిషి ప్రవేశించి కూర్చోడానికి వీలుగా ఒక గుహ ఏర్పడివుంది. అది తన తపస్సాధనకు అనుకూలమనుకొన్నాడు. నానూస్వామి కొండగుట్టల మధ్య, చెట్లుచేమల నడుమ, క్రూర మృగముల చెంత ఏకాంతవాసం చేశాడు. పులులతో, పాములతో మైత్రి నెరిపాడు. ఆకలి తీరక అగచాట్లు పడ్డాడు. అయినా బెల్లం చీమల్ని ఆకర్షించినట్లు స్వామి బాధిత ప్రజానీకానికి ఓదార్పు బిందువైనాడు. తన ఆయుర్వేద విజ్ఞానంతో బాధితుల రుగ్మతలు తొలగించాడు. మానసిక సమస్యలు తీర్చాడు. కష్టాలను తేలికగా గ్రహించే తీరు తెల్పాడు. సంతాన ప్రాప్తికై అతన్ని ప్రార్థించినవారు ఉన్నారు. ప్రజల సమస్యలు, కష్టాలు, కడగండ్లు స్వామికి బాగా అర్థమైనాయి. స్వామి మాటలు వినడానికి, తమ కష్టాలు చెప్పుకోవడానికి ఆశ్రయించిన వారు తమతో ఆహారం కూడ తెచ్చేవారు. స్వామి ప్రీతిగా తినేవారు. అలా జనసందడి పెరిగింది. అది యాత్రా స్థలమైంది. ఆరాధనకు అక్కడ ఒక ఆలయం అవసరం అని స్వామి గుర్తించాడు.

నానూస్వామి కొంతకాలం ఏకాంతంగానూ, కొంతకాలం జనం మధ్యనూ కాలం గడిపేవాడు. అంటే అతని సంచారానికి, అన్వేషణకు రెండు కారణాలున్నాయి. 1. ప్రజల మనిషిగా, ప్రపంచ ప్రతినిధిగా తాను ప్రజల అసమానతలకు, సంఘర్షణలకు మూలమైన విభేదాలు తొలగించే

విధానం కనిపెట్టడం 2. ఆ విధానం అనుసరించడానికి అవసరమైన స్వేచ్ఛ, ఆసక్తి, శక్తి సామర్థ్యం ప్రజలకు కల్పించడం.

స్వామి మహాతాత్త్వికుడు, ప్రజాప్రేమికుడు, సమాజ సేవకుడు. తన భావాలకు తగినట్లు ప్రవర్తిస్తూ, సంబంధాలు పెంచుకుంటూ, ప్రజా సమస్యలు పరిష్కరించుకొంటూ ముందుకు పోయాడు. ఆత్మ విశ్వాసానికి, దైవ విశ్వాసానికి, ప్రజాభీష్టానికి అనుగుణంగా ఒక ఆరాధన కేంద్రం ధ్యేయం కాగా, అందుకు జనసమీకరణ తన ప్రాథమిక ఉద్యమమైంది.

## శివలింగ ప్రతిష్ఠ

శివరాత్రి రోజున ఒక శివలింగ క్షేత్ర కేంద్రం ఏర్పాటు చేయాలని సంకల్పించాడు. సమీపంలో ఉద్ధృతంగా ప్రవహించే నదిలో మునిగాడు. అది సుప్రభాతసమయం. ధ్యాన మగ్నుడై ఉండవచ్చు. నదిఒడ్డున భక్తజనం ఆతురతతో ఎదురుచూస్తుంది. ఏమి జరుగనున్నదో యని కలకల ముదయించింది. అంతలో ప్రసన్న వదనంతో, ఒక శివలింగంతో నానూ స్వామి పైకి లేచాడు, ప్రత్యక్షమైనాడు. జనంతో పాటు నడిచి వచ్చాడు. సిద్ధపరిచిన రాతిఫలకంపై శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. దాన్ని ఆరాధించే హక్కు, అవకాశం, స్వేచ్ఛ అప్పటికప్పుడే ప్రప్రథమంగా అస్పృశ్యులకు కల్పించాడు. అయితే దైవప్రతిష్ఠ చేసే హక్కు బ్రాహ్మణేతరులకు ఎక్కడి నుండి వచ్చింది అని బ్రాహ్మణులు తీవ్రంగా ప్రశ్నించారు. “నేను ఏళువా శివుని మాత్రమే ప్రతిష్ఠించాను” అని చిరునవ్వుతో స్వామి సమాధానం చెప్పాడు. ఆపై ఎవ్వరూ నోరు మెదపలేదు.

## శ్రీనారాయణ ధర్మపరిపాలన యోగం (యస్.యన్.డి.పి యోగం)

**విగ్రహప్రతిష్ఠ చర్య :** ఒక నూతన చరిత్ర ఆరంభమైంది. అది సామాజిక విప్లవానికి ఆధారమైంది. ఎందుకంటే శూద్రుడు విగ్రహ ప్రతిష్ఠ చేయడం, అస్పృశ్యుడు ఆలయంలో ప్రవేశించడం, తానుగా ఆనందంతో ఆరాధన చేయడం ఇవి అసామాన్యమే కాదు, అపురూపం. ఇది నూతనాధ్యాయానికి నాంది. స్వామి కార్యశూరుడు! అతని ప్రక్రియ మౌనంగా మాట్లాడుతుంది. ప్రగల్భాలు లేకనే ప్రచారము చేస్తుంది. అరివిప్పురం స్వేచ్ఛకు స్వాగతగీత మైంది, పేరు తెచ్చింది, కీర్తి గాంచింది.



**“ఎల్లజనులు కులవిభేదాలు, మతవైరాలు లేని సోదరులుగా జీవించే నమూనా నివాసం”** అని అక్కడ వ్రాయించాడు. ఇది మొదటి నినాదం. **“సంఘం ద్వారా శక్తి, చదువు ద్వారా స్వేచ్ఛ** అనేది రెండో నినాదం. ఈ రెండూ తన ఉద్యమానికి ప్రధాన నినాదాలు.

శివాలయ నిర్వహణకు ఇప్పుడొక కొత్తవ్యవస్థ, కొత్త సంఘం కావలసి వచ్చింది. స్వామి సూచనలతో అది సులభంగా 1899లో ఏర్పడింది. ఆ సంఘ సభల్లో మత సాంస్కృతిక సాంఘిక సంస్కరణల గురించి చర్చించడం మొదలుపెట్టారు.

మతపరంగా స్వేచ్ఛ, సమాజపరంగా సమత, భౌతికపరంగా ప్రగతి అవసరమని గుర్తించారు. కేరళలో యెళువ కమ్యూనిటీలో రావలసిన అభ్యుదయం గూర్చి స్వామికి ఒక దృక్పథం ఉంది. తదను గుణంగా మూడేళ్ల పిదప ఆలయ నిర్వహణ సంస్థ **“శ్రీ నారాయణ ధర్మ పరిపాలన యోగం” (యస్.యన్.డి.పి.యోగం)** గా రూపుదిద్దుకొంది. గౌతమబుద్ధుడు తీర్చిదిద్దిన భిక్షుసంఘం తీరులో ఇది ఏర్పడింది. యస్.యన్.డి.పి. శ్రీ నారాయణ ధర్మం సువ్యాప్తం చేయడానికి ఉద్దేశింపబడింది.

## అద్వైతం – ఆచరణ

నానూ అసన్ స్వామియై సేవాకార్యక్రమం ప్రారంభించడానికి ఒక ప్రేరణ ఉంది. దానికి ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది. గుహలో ధ్యానస్థితుడై

యున్నపుడు కొన్ని అనుభూతులు కలిగాయి. వాటి వివరాలు సూటిగా తెలియకపోయినా, వాటి సామాజిక ప్రభావం స్పష్టంగా గోచరించింది.

అద్వైతం ఏకత్వం సూచిస్తుంది. విభజనలు, విభేదాలు, వైరుధ్యాలు అంగీకరించదు. ఆధ్యాత్మిక అఖండత్వం భావనకే పరిమితమైంది. ఆచరణకు సాధ్యం కాదనే వారున్నారు. డా॥బి.ఆర్.అంబేడ్కర్ సైతం అద్వైత సిద్ధాంతం మహోన్నతమైన భావనయని ప్రశంసించారు. నానూస్వామి శంకర అద్వైత సూత్రానికి సమున్నత స్థాయి కల్పించాలనుకున్నాడు. మత విశ్వాసాలతో కూడియున్న మనుషులను గుడిద్వారానే ఆకర్షించాడు. అంటే దైవవిశ్వాసానికి, దైవారాధనకు, దైవదర్శనానికి కులమత లింగ జాతి భేదాలు పాటించకూడదు, వాటిని విడనాడాలి, ఏకమనస్కత సాధించాలన్నాడు. సామాన్య జనం నమ్మకాన్ని బలపరిచేది ఆలయదర్శన మనుకొన్నాడు. అందుకు నూతన దేవాలయ నిర్మాణం తలపెట్టాడు. స్వామికి స్వామియే గొప్పదైవ విశ్వాసి. నిజమైన మతం మనిషిని మెరుగుపరిచేది, యథార్థతను వెలికి తీసేది, ఉచ్చ నీచాలను త్రుంచి వేసేది అన్నాడు. కుల మత వ్యత్యాసాలను చదును చేసేది అని కూడ అన్నాడు. మానవాళి సంక్షేమాన్ని, స్వేచ్ఛను చేకూర్చేది అని అతని ధృడవిశ్వాసం. అది అతని వైఖరిలో కనబడుతుంది. అదే అతని మతాద్వైత సూత్రం. స్వామి తటస్థుడు. ఏ కార్యక్రమం గాని దాని అనుబంధాలు గాని ఇతరుల నిమిత్తమే. అంతేకాదు మత, సాంస్కృతిక, భౌతిక, సామాజిక ప్రగతిలో అద్వైత సమన్వయం ఉందని భావించాడు. అతని దృష్టిలోనూ అతని ఆచరణలోనూ గల వేదాంతమే అద్వైతం. అందుచే అతని అవగాహనాతత్త్వాన్ని సామాజిక అద్వైతం అనవచ్చు. అతని అద్వైతానుభూతిని సంస్కృతంలో విరచించిన వంద పద్యాల "ఆత్మోపదేశ శతకం" ద్వారా తెలుసుకోవచ్చు.



## యువకుడు కుమరన్ – డాక్టరు పల్పు

స్వామి ఒకసారి త్రివేంద్రం సమీపాన గల కైకర వెళ్లాడు. అక్కడ కుమరన్ అనే యువకుడు స్వామిని దర్శించి, తన కవితలు వినిపించాడు. ఉద్రేకపరిచి, సంచలనం కల్గించే కవిత్వం వద్దని స్వామి సలహా ఇచ్చాడు. కుమరన్‌లోని కళాత్మకమైన ఆణిముత్యాన్ని స్వామి పసిగట్టాడు. కుమరన్ ఆకర్షితుడై శిష్యుడయ్యాడు. భక్తకవిగా, వేదాంతిగా, యోగిగా కుమరన్ ప్రసిద్ధి చెందాడు. స్వామి వల్ల కుమరన్ బెంగళూరులో డా॥ పల్పు సహాయాన విద్యాభ్యాసం చేశాడు.

డా॥ పల్పు యెళువ కులానికి చెందినవాడు. దేశవిదేశాల్లో వైద్యనైపుణ్యం గడించినవాడు, సేవాపరాయణుడు. వివేకానందస్వామి శిష్యుడు. వివేకానంద అమెరికా వెళ్ళడానికి, పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్‌లో యెళువల దుస్థితిని ప్రస్తావించడానికి కారకుడైనవాడు. ఒక ఆధ్యాత్మిక నాయకుని కనుసన్నల్లో సేవాకార్యక్రమాలు చేయమని వివేకానంద డా॥ పల్పుకు సలహా ఇచ్చాడు. అప్పుడు పల్పు మెదడు తెరపై నానూస్వామి తళుక్కుమన్నాడు. అరువిప్పురం ఆలయం ట్రస్ట్ యస్.యన్.డి.పి. యోగంగా 1903లో మార్పు చెందడానికి డా॥ పల్పు ఒక ముఖ్యకారకుడు. దానికి డా॥ పల్పు అధ్యక్షుడిగా, కుమరన్ అసన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనారు.

## నారాయణ గురువు

శిష్యవర్గం పెరగడంతో నానూస్వామి, 'నారాయణగురువు' గా అయ్యాడు. గురువు ఆధ్యాత్మిక పురుషుడుగా, మహిమాన్వితుడుగా దీనజన బాంధవుడుగా ప్రజల్లో పేరు గాంచాడు. అతని హృదయంలో యెళువా జనాన్ని, ఇంకా అట్టడుగు వర్గాన్ని ఉద్ధరించాలనే ఆకాంక్ష గాఢంగా ఉంది. "యోగాన్ని" ఆ తీరులో మలిచి నిర్వహించాల్సి ఉంది. అప్పటికే "యోగం"

కేరళ యళువల కాంగ్రెస్ సంస్థగా ముద్రపడింది.ఏ కులసమూహానికైనా ఇండియాలో కేవలం భౌతికసంపదతో పేరు రాదు. ఏ సంస్థ అయినా మతంతో ముడిపడి వుంటే తప్ప ఆశించినఫలం లభించదు అనేది అప్పట్లో బలంగా ఉన్న అభిప్రాయం.

"యోగం" విజ్ఞాపన పత్రంలో కుమరన్ అసన్ వ్రాసిన ముందుమాటలు వివేకానంద వాక్యంతో ఇలా మొదలైనాయి. 'భారతదేశం ఎదగడానికి దిగజారిపోవడానికి మతమే గుప్పిట పట్టు'. భారతదేశంలో ఎగువ కులాలవారు దిగువకులాలపై, ముఖ్యంగా కేరళలో చేస్తున్న దాడులు అమానుషం. కేరళకు చెందిన అట్టడుగు జనం జంతువుల కన్నా హీనంగా పరిగణింపబడుతున్నారు. యళువాలు కొచ్చిన్, ట్రావెంకూర్, మలబార్ ప్రాంతాలలో గణనీయంగా ఉన్నారు. కానీ సామాజిక పరిస్థితుల్లో అధ్వాన్నంగా ఉన్నారు. ఈ పరిస్థితులు చక్కదిద్దడానికి ఎవ్వరూ లేరు". ఈ విధంగా వ్రాయడమైంది.

విజ్ఞానపనపత్రంలో గురుస్వామి రెండు నినాదాలు పలికారు - **"సంఘంద్వారా శక్తి", "విద్య ద్వారా స్వేచ్ఛ"**

స్వామి సేవ మూడు విధాలుగా గణుతించవచ్చు.

1. స్వామి ఆధ్యాత్మిక సాధనా సంపత్తి 2. ప్రజలకు చేసే వ్యక్తిగత గుప్తసేవ 3. "యోగం" జరిపే కార్యక్రమాలు.

సంచారం, జనసాన్నిధ్యం, ప్రకృతి సౌందర్యం, ఏకాంతం, ధ్యానం, ఆలయాలస్థాపన - ఇవి నారాయణ గురుస్వామికి ఎంతగానో ఇష్టమైన కార్యాలు. ఏది ఎప్పుడు జరపాలనుకొనేవారో వారికే ఎరుక. కొద్దిపనులు పురమాయించేవారు, కొద్ది సలహాలు ఇచ్చేవారు. అంతలో ఎటోవెళ్ళిపోయే వారు. అంటే ఆయన అంటీ అంటనట్లుండడం ఆయన స్వభావం. జనం



ఆయన్ని చూస్తే ఆకర్షితులయ్యేవారు. ఆయన స్వయంగా ప్రచారం చేసేవారు. ఆయన అలా సుప్రసిద్ధుడు కావడమే గాక యళువాలకు దేవుడై పోయాడు.

"పేరేమిటి, కులమేమిటి, వృత్తేమిటి, ఇంకేమిటి, ఇంకెంతకాలం అనే ప్రశ్నల నుండి ఎవడు స్వేచ్ఛ పొందుతాడో అతడే సంపూర్ణుడు, అతడే స్వతంత్రుడు" అని స్వామి వ్రాసుకొన్నాడు.

## శివగిర్యాశ్రమం - శారదామఠం

త్రివేంద్రం ఉత్తరాన వర్కల కొండలున్నాయి. 20 మైళ్ళ దూరంలో సముద్రతీరాన వర్కల పట్టణముంది. వర్కల కొండలను శివగిరి అంటారు. శివగిరి ప్రాంతాలను స్వామి ఎప్పుడో చూశాడు కాని 1903 నుండి అక్కడికి తరచుగా వెళ్లుతుండేవాడు.

శివగిరి కొండగుట్ట మీద ఒక పూరిపాక వేయించాడు. ఒక చక్కని పూలతోట పెంచాడు. జనం అక్కడికి చేరడం మొదలు పెట్టారు. అది ఒక ఆశ్రమం అయ్యింది. వర్కల్ అప్పటికే దక్షిణ కాశీగా, యాత్రాస్థలంగా ప్రసిద్ధి చెంది ఉంది. యాత్రికులు సముద్ర తీరాన వార్షిక కర్మకాండలు జరుపుకుంటూ ఉండేవారు. అక్కడ ఒక ఆలయ నిర్మాణానికి స్వామి ఏర్పాట్లు చేశాడు. 1904 నుండి ప్రతి సంవత్సరం కర్కాటక అమావాస్య రోజున యళువాలు పెద్ద సంఖ్యలో ఆశ్రమంలో వార్షిక విధులు నిర్వర్తించుకోవడం మొదలు పెట్టారు. ఆ విధుల్లో స్వామి శిష్యులు పౌరోహిత్యం వహించేవారు. శివగిర్యాశ్రమం మతపరమైన ముఖ్య కేంద్రమయింది. అక్కడ స్థానిక పేదపిల్లలకు పగటి పాఠశాల 'కురవల' కు రాత్రి పాఠశాల ప్రారంభించాడు.

వర్కలలో 1907లో శివాలయ నిర్మాణం మొదలైంది. 1908లో శారదా మఠానికి మహావైభవంగా శంకుస్థాపన జరిగింది. పద్మాసనా

సీనురాలైన శారదాదేవి సర్వాంగ సుందరంగా, శోభాయమానంగా దర్శనమిస్తుంది. సంప్రదాయ మత విధుల జోలికి పోలేదు. భక్తులు స్తోత్రపాఠాలు, ధ్యానం చేయడానికి వసతులు కల్పించారు. సంస్కృత పాఠశాలకు స్థలనిర్ణయం జేశారు. అనేక స్నానగదులు కట్టించారు.

**ఆలయాల గురించి స్వామి అభిప్రాయం**

ప్రజలకు అవగాహన, ఆహ్లాదం, ఆరోగ్యం, ఆత్మీయానందం అనుభూతి, ఆదర్శ వాతావరణం, అభేదదృష్టి, అద్వైత చింతన కల్గించాలని స్వామి లోలోన ఆరాటపడుచుండేవాడు. అందుకు అనుకూలమైన వాతావరణం ఆలయాల ద్వారా అందించాలనుకున్నాడు. ఆలయాలు అధునాతనంగా ఉండాలని కోరాడు.

ఆలయప్రాంగణాలు విశాలంగా, పూల తోటలలో అనువైన అరుగులతో చాలినన్ని స్నానగదులతో, చూడముచ్చటైన చెట్లతో, గాలివీచే వసతులతో పరిశుభ్రమైన పరిసరాలతో అందచందాలతో విలసిల్లాలని ఆశించాడు. గర్భగుడిలాంటి చోటు ప్రశాంత చిత్తాన్ని, దైవచింతనను, పవిత్రభావాలను, ధ్యాన నిష్ఠను కల్గించి మనస్సులోని తమస్సును తొలగించేదిగా ఉండాలని చెప్పాడు.

ఆలయప్రభావంతో భక్తులు ఉపవసించి, మనోదేహాలను శుభ్రపరుచుకొంటారనీ, ఆధ్యాత్మిక విషయాలు గ్రహిస్తారనీ, మంచి విషయాలు మాట్లాడతారనీ, మంచిగా ఉంటారనీ ఒక పత్రికా విలేకరితో అన్నాడు. ఆలయాలు నిజంగా అవసరమనీ వాటిని చక్కగా నిర్వహించాలనీ, చాలా మంది శివగిరికి వచ్చి తమ బాధలు తొలగించుకొని వెళ్తారనీ చెప్పాడు. వ్యక్తిగత పారిశుద్ధ్యం, ధ్యానం, పరిశుభ్రమైన గాలి రుగ్మతలను తొలగిస్తాయన్నాడు.



అస్పృశ్యులకు ఆలయప్రవేశం కల్పించడం, అన్ని కులాల వారూ ఆ ప్రాంతంలో కలిసిపోవడం, శూద్రులకు స్వతంత్ర దైవారాధన హక్కు కలిగించడం, ఎల్లరికి సంస్కృతం నేర్పించడం, యళువాలను విద్య, ఆధ్యాత్మిక పారిశ్రామిక రంగాలలో ప్రవేశపెట్టడం ఆయన ముఖ్యోద్దేశం కనుక ఆలయనిర్మాణం ఆయన తలపెట్టిన సాంఘిక సంస్కరణలో ప్రధాన భాగమైంది.

**గుళ్ల పరంపర**

మార్చి 1906లో స్వామి తెల్లిచ్చేరి వెళ్ళినపుడు వారిసమక్షంలో ఆలయరూపకల్పనా క్షేత్రం నిర్ణయమైంది. 1908 ఫిబ్రవరిలో స్వామి స్వయంగా ఆలయ ప్రతిష్ఠ జరిపి జగన్నాథ ఆలయమని నామకరణ జేశాడు. దళితవర్గాలకు దర్శనం కల్గించినప్పుడు వ్యతిరేకత చెలరేగింది. గందరగోళం అంతా గమనించాడు స్వామి. మౌనం వీడి మెల్లగా "పులయులకు దేవాలయ ప్రవేశం కల్పించగలరు" అనేసరికి అంతా సద్దుమణిగింది. ఆ క్షణంలో మూర్కోల్ కుమారన్ అనే గొప్ప రచయిత, మహావక్త ప్రజల్లో బాగా పేరు గాంచిన వ్యక్తి స్వామి ముందు సాగిలపడినాడు. అతడు ఇతరుల ముందు తలవంచడం అదే మొదటిసారి, అదే చివరిసారి అని జనం ఉల్లాసంగా చెప్పుకొన్నారట. కాలికట్‌లో శ్రీవేంకటేశ్వర ఆలయం ప్రతిష్ఠించడం (1910) జరిగింది. కన్ననూర్‌లో శ్రీస్వామి సుందరేశ్వర ఆలయం (1916) ప్రతిష్ఠించాడు.

1922లో త్రివేంద్రం సమీపంలో మురుకుంపుంజలో స్వామి గుడికట్టించి అందులో దీపం ప్రతిష్ఠ జేయించాడు. ఆలయం మీద **"సత్యం, విధికృతం, కరుణ, ప్రేమ"** అని చెక్కించాడు. అలాంటి ఆలయాలు మరి రెండు చోట్ల కట్టించాడు.

షెర్తల్లై, వద్ద నిర్మించిన కలవంకొాడం ఆలయం కథ పూర్తిగా వేరైంది. స్వామి ఆలయ ప్రతిష్ఠకు వేంచేశాడు.

ఒక బృందం విగ్రహారాధనకు వ్యతిరేకంగా, మరోబృందం అనుకూలంగా కీచులాడడం మొదలుపెట్టారు. ఇరువురి వాదనలను స్వామి శ్రద్ధగా విన్నాడు. మౌనంగా ఉండి వినడంలో స్వామి మహా ఆసక్తిగా ఉంటాడు. ఆయన వినడంలోనే చెప్పేవారి ఉద్రేకాలు చల్లబడతాయి. చివరికి ఆయన మాట్లడేది కొద్దిమాటలే. విగ్రహాలు అవసరమని గాని అక్కరలేదని గాని చెప్పలేదు. అది పెట్టాలా వద్దా అని పలకలేదు. ఒక నవ్వు నవ్వాడు. ఒక మంచి పెద్ద అద్దం తెమ్మన్నాడు తెచ్చారు. దానిపై “ఓం” అని వ్రాయించాడు. “దీన్ని మనం ఎందుకు ప్రతిష్ఠించ కూడదు?” అన్నాడు. ఎవరూ నోరెత్తక ముందే పని జరిగిపోయింది. దానిపై వ్యాఖ్యానం చేయలేదు; సహజంగా సామాన్యంగా జరిపినట్లైంది. అంతట ఆయన వెళ్ళిపోయాడు. ఆ సంప్రదాయ ధోరణి పై ఎందరో సానుకూలంగా స్పందించారు. డా॥ పల్పు గొప్ప గుణోపేతంగా గురువుచే ప్రతిష్ఠితమైన గుడిగోపురాలపై సువ్యాఖ్యానం చేశాడు. గురువు మాత్రం దానిపై మౌనం వీడలేదు.

“అత్యధిక ధనం వినియోగించి, పూర్వాచారం ప్రకారం దేవాలయ భవనాలు నిర్మించ పనిలేదు. బాణాసంచాలకు, ఉత్సవాలకు డబ్బు ఖర్చు పెట్టవద్దు. ఆలయాలవద్ద విశాలమైన గదులుండాలి. అవి జనం చేరడానికి ప్రవచనాలు జరగడానికి ఉపయోగపడాలి. ప్రతిగుడి వద్ద పాఠశాలలు తోటలు ఉండాలి. అక్కడ పిల్లలకు పారిశ్రామిక శిక్షణ జరపడానికి వసతులు కల్పించాలి. భక్తుల కానుకల ద్వారా సేకరించిన ధనం పేదల ప్రయోజనానికి వాడాలి. పేదల, బలహీనుల సేవయే పరమాత్మ సేవయని ప్రవచించాడు.

శ్రీ నారాయణ గురువు ఆలయ నిర్మాణ పథకం బహుళార్థసాధకం. ఆలయాలన్నీ శూద్రులచే ప్రతిష్ఠింపబడటం నిర్వహింపబడడం ఒక ముఖ్య విశేషం. అంతకన్నా ముఖ్యోద్దేశం జనాన్ని రాబట్టడం. ఏ విశ్వాసానికి అలవాటై, బద్ధులై ప్రజలు బ్రతుకుతున్నారో అదే విశ్వాసం ఆధారంగా పీడితతాడితబడుగు బలహీన అట్టడుగు వర్గాలను సమైక్యపరచాలి. వారిని సంఘటితం జేసి సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాలలో సముద్ధరించడం నారాయణగురు ప్రధానాశయం. గుడి సంప్రదాయాలు పాటించడం కంటే భక్తుల హృదయాలు చూరగొనడం ఆయనకు ముఖ్యం. అందుచే ఒక్కొక్క గుడి ఒక్కొక్క తీరులో రూపొందింది. స్పృశ్యులు, అస్పృశ్యులు అనే వ్యత్యాసం లేకుండా అందరికీ ఆలయప్రవేశం కల్పించాడు. ఆర్భాటాలకు, వాదోపవాదాలకు తావు లేకుండా చిరునగవుతో, మధుర వచనాలతో, గంభీర భావనతో అనుకున్నది సాధించడం ఆయన ప్రత్యేకత. ఎదుటివారు సమాధానపడి సంతృప్తి జెందే వారు. బ్రాహ్మణులు, అగ్రకుల భావనగల హైందవులు సైతం ఆ ఆలయాలకు వెళ్లేవారు.



**ఆల్వాయె అద్వైత ఆశ్రమం**

శారదాదేవి ప్రతిష్ఠ పూర్తి అయిన రెండవ రోజున నారాయణ గురుస్వామి శివగిరి నుండి బయలుదేరాడు. వెంట ఒక శిష్యుడున్నాడు. కార్తికపల్లిలో ఒక భక్తుని ఇంటికి చేరాడు. అల్వాయెలో తనకు కొంత స్థలం కావాలని కోరాడు. ధర అధికమని గృహస్థు చెప్పగానే డబ్బు ఎక్కడబడితే అక్కడున్నది, తనపేర కొనే మనిషి కావాలన్నాడు. అందుకు గృహస్థు అంగీకరించాడు.

ఇరువురూ అలెప్పే, షెర్టల్లయ్ వెళ్లారు. విరాళాలు సేకరించడం మొదలు పెట్టారు. అనేక చోట్ల వసూళ్ళు బాగానే ఉన్నాయి. సమస్యలు కూడ అలాగే వస్తాయి కదా! విరాళాలు వసూలు చేసేవారిమధ్య వైరాలు కూడ చోటుచేసుకుంటాయి. అయినా గ్రామ గ్రామం తిరిగి తగినంత ధనం సేకరించారు. అల్వాయి చేరారు.

అల్వాయె నది ఒడ్డున ఒక పాక వేయించాడు. పిదప దాని స్థానంలో ఆశ్రమ నిర్మాణం చేశాడు. వరదలకు దెబ్బతింటే పునర్నిర్మాణం చేయించాడు. అక్కడ పాఠశాల పెట్టాలని చాలా కష్టపడి మళ్ళీ విరాళాలు సేకరించాడు. 1914లో సంస్కృత పాఠశాల ప్రారంభించాడు. అన్ని కులాలకు అన్ని మతాలకు చెందిన విద్యార్థులు అక్కుడుండి, చదువుకొనేటట్లు ఏర్పాట్లు చేశాడు. సంస్కృతంలో ఆరు తరగతులు చదివిన పిదప శాస్త్రి పరీక్షకు విద్యార్థులను తయారు చేయించేవాడు. అల్వాయె పాఠశాలలో చదివిన అనేకమంది దళిత విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద ఉద్యోగ హోదాలు పొందారు.

అద్వైతాశ్రమంలో ఆలయంగాని, విగ్రహారాధన గాని ఏర్పాటు చేయలేదు. ప్రార్థనలు చేయడానికి, అద్వైత సంప్రదాయ సారం అధ్యయనం చేయడానికి తగిన వసతులు కల్పించడమైంది. హైందవులు హైందవేతరులు కలిసి చదువుకునేటట్లు కలిసి ఉండేటట్లు, ఆదేశాలిచ్చాడు.

శివగిరి ఆలయంలో దళితులకు సైతం దేవీ దర్శనం కల్పించాడు. వాళ్లతో ఆరాధనలు జరిపించాడు. అందరితోపాటు గీతోపనిషత్తుల పారాయణం కల్పించాడు. అంతేగాక వారితో వంట వార్పు చేయించాడు.

**సాంఘికోద్ధరణ**

శ్రీ నారాయణ గురుస్వామి కాషాయాంబరధారి, త్యాగి, విరాగి, పాదచారి, ఒంటరి, వనసంచారి, నిస్సంసారి, ఆత్మజ్ఞాని, ధ్యాని, అలౌకికుడు, విముక్తుడు. అయినా అజ్ఞానుల పట్ల, అమాయకుల పట్ల, అనూహ్యమైన ఆవేదన జెందేవాడు.

ఆలయనిర్మాణం ఆధ్యాత్మిక ప్రబోధంతో పరిమితమైన యస్.యన్.డి.పి.యోగం 1904 నుండి సామాజిక సేవకు ఉపక్రమించింది. అదే సంవత్సరం పరవూర్ (Quilon) లో యళువ సమావేశం నారాయణ గురు అధ్యక్షతలో జరిగింది.



దురాచారాలను, మూర్ఖపు కర్మకాండను అరికట్టాలని స్వామి పిలుపునిచ్చాడు. "తాలికెట్టు", "తిరందుకులి", "పులికుతి" మున్నగు వైవాహిక దురభ్యాసాలను నిషేధించాలన్నాడు. వాటి బదులు క్రొత్త విధానాలు ప్రవేశపెట్టాడు. 'తాలికెట్టు' అంటే 12 ఏళ్లలోపు అమ్మాయిని మగపిల్లవానితో ఒక పాకలో పెట్టి అమ్మాయికి తాళి కట్టిస్తారు; 41రోజులు విందులు వినోదాలు చేస్తారు. 'తిరుందుకులి' అనేది పెద్దమనిషి అయిన పిల్లకు స్నానం చేయించి, చీకటిలో పెట్టి, పెళ్లికొడుకు సోదరితో బట్టలు ఇప్పించడం. భారీఖర్చు పెడతారు. 'పులికుతి' లో ఘాటు పదార్థాలతో కూడిన పానీయాన్ని మొగుడు పెళ్లాంతో తాగించి, ఉత్సవం చేస్తారు.

ఈ దురాచారాలను జ్ఞానాగ్నితో ధ్వంసం చేయాలని స్వామి 1905లో నాలుగు విషయాలపై ఘాటుగా అన్నిచోట్ల ప్రసంగాలు చేయమని ఉపన్యాసకులను నియమించాడు.

**నాలుగు ప్రసంగాలు**

**1.మతం :** మూఢనమ్మకాలు వదిలిపెట్టడం, జంతుబలితో కూడిన కర్మకాండను త్యజించడం, దుష్టశక్తులంటూ ఏవీ లేవని నిరూపించడం, సగుణ నిర్గుణ ఆరాధన గూర్చి మాట్లాడడం, ఇతర మతాలను కించపరచకుండా ఆలయనిర్మాణాలు ప్రోత్సహించడం.

**2. నీతి :** సత్యం, పరిశుభ్రత, ఆస్తికత, ఏకత్వం కల్గియుండుట, అర్థరహితమైన, హానికరమైన ఆచారాలను అవతలకుపెట్టి, కాలానుగుణమైన ఉన్నత ప్రవర్తనా విధానాలను ఆదర్శవంతంగా ప్రజలముందు పెట్టడం.

**3. చదువు :** విద్య యొక్క ప్రయోజనం, విద్యావిహీనతవల్ల నష్టం వివరించి, ఒక్క యళువా కూడ ప్రాథమిక విద్యలేని మనిషి కాకూడదని పాఠశాలలు, గ్రంథాలయాలు, నెలకొల్పాలని ఉద్బోధించడం.

**4. పరిశ్రమ :** వ్యవసాయం, వ్యాపారం చేతిపనులు ఉత్తమమార్గంలో వృద్ధిపర చాలి. సోమరితనం అసాంఘికమని ప్రతివాడు సిగ్గు పడేలా చెప్పాలి. పారిశ్రామిక కార్ఖానాలు పెట్టాలి. అందుకు అధ్యయనం చేసి ప్రచారం చేయాలి.

సందేహాలకు సమాధానం చెప్పాలి, ఏ వర్గం గాయపడకుండా జాగ్రత్త పడాలి. దిగువ వర్గాల వారిని పైకి తీసుకొనిరావాలి అని స్వామి నిర్దిష్టం చేశాడు.

ప్రచారకులను నలుదిక్కులకు పంపాడు. స్వామి స్వయంగా ట్రేవంకూరు రాష్ట్రమంతటా ప్రచారం చేశాడు. సరళమైన రీతిలో వివాహాలు జరపడం మొదలుపెట్టారు. జంతుబలులు కొన్ని చోట్ల రద్దయినాయి. స్వామి సన్నిధిలో కఠినాత్ములు సైతం కరిగిపోయేవారు. కొందరికి ఉత్తరాలు రాసి నచ్చ జెప్పేవారు. "వివేకోదయం" పత్రిక ద్వారా తన సందేశం, కొత్త విధానాలను ప్రజలకందించేవాడు. మొత్తంమీద ప్రజల్లో ముఖ్యంగా ఎళువాలలో సంస్కరణ బీజాలు గట్టిగా పడ్డాయి. కదలికలొచ్చాయి. సర్పపూజలు, సర్పవనాలు, నాగ ఆరాధనలు, యాగాలు, మూర్ఖ విశ్వాసాలు. బహు భార్యాత్వం, బహుభర్తృత్వం వీటిని పూర్తిగా ఖండించాడు.

ఈ సందర్భంలో ఒక బ్రహ్మచారి ప్రచార నిమిత్తం ఒక సంఘం స్థాపించాలని సంకల్పించాడని తెలసి స్వామి చాల సంతృప్తి పడ్డాడు.

## పేదబిడ్డలకు విద్య

1912లో చెన్నైలో విజ్ఞానవర్ధిని సభ జరిగింది. స్వామి ఇలా మాట్లాడి నాడు. "మనదేశంలో చాలా తక్కువ మందికి ఉన్నత విద్య అబ్బింది. ఇటీవల



మన కులంవారు చదువుపట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇది అభిలషణీ యం.ధనవంతులు తమకు చదువు లేకపోయినా పేద విద్యార్థులను చదివించాలి. వాళ్ళకు ఉన్నత విద్య కల్పించాలి. సంస్కృతం ప్రాముఖ్యం క్రమంగా తగ్గిపోతుంది. ఆంగ్లం ప్రధాన భాష అయింది. కనుక మనదృష్టి ఆంగ్లం వైపునకు మారాలి. మహిళలు విద్యావంతులు కావాలి. వాళ్లను దిక్కుమాలిన వారిగా వదలరాదు.

"విద్యాభివృద్ధి పిదప, పరిశ్రమలవైపునకు మరలాలి. మనం చాలా పేదలం. పరిశ్రమల వల్ల మాత్రమే పేదరికం తొలగుతుంది. యంత్రాలు కొనాలి, కంపెనీలు తయారు కావాలి. మన ముడిసరుకు బయటకి పంపిస్తున్నాం. అలా కాదు, కార్ఖానాలు ఇక్కడ స్థాపించాలి. అందుకు యువకులకు పారిశ్రామిక విద్యగరపాలి.

"ప్రతిగ్రామంలోనూ సాంస్కృతిక సంఘాలు, గ్రంథాలయాలు, పెట్టాలి. కులవర్గం బలపడాలి. ధనవంతులు ముందుకు రావాలి."

## పులయులను వ్యతిరేకించిన ఎళువలు, నాయర్లు

1915లో నెయ్యతింక్కర తాలుకాలో నాయర్లకు, పులయులకు (అస్పృశ్యులు) మధ్య సంఘర్షణ పుట్టింది. పులయుల పిల్లల చదువుకు నాయర్లు అడ్డుపడ్డారు. రెండు వర్గాలు తలపడగా యళువాలు నాయర్లవైపున జేరారు. పోరాటం వస్తే నిమ్న జాతులకు మిగతా వారందరూ వ్యతిరేకమే. ఇది సమాజంలో సహజం. బడికి పిల్లల్ని తీసుకొచ్చిన పులయులను నాయర్లు కొట్టారు. అప్పుడు స్వామి అరివిప్పురంలో ఉన్నాడు. విషయం తెలిసి స్వామి చాలా బాధపడ్డాడు. యస్.యన్.డి.పి యోగం కార్యకర్తల ద్వారా మానవ విలువలు కాపాడాలని సందేశం పంపాడు. యళువాలు, నాయర్లు చల్లబడ్డారు. పులయ పిల్లలకు విద్యాలయ ప్రవేశం దక్కింది.

నారాయణ గురుస్వామి ఏ కులంలో పుట్టాడో, ఏ కులాన్ని మిక్కిలి ఉద్ధరించాలనుకున్నాడో ఆ కులం వారే, నిమ్నజాతులనబడిన 'పులయుల దేవాలయ, విద్యాలయ ప్రవేశానికి అడ్డుపడడం విడ్డూరంగా కన్పించవచ్చు. కులవ్యవస్థకు ఉన్న బలం ఇది యని యళువాలకు తెలియనిది కాదు. నారాయణగురువుకు తెలియనిది కాదు. స్వామి పులయులను ప్రేమిస్తు న్నాడని, తనమాట విననప్పుడు స్వామి ఒక చిరునవ్వు, దాని వెనుక ఒక వేదన కనపరిచేవాడు. స్వామి గ్రామగ్రామాన తిరిగి మానవ విలువల, పులయుల దీనస్థితి గురించి బోధించేవాడు. యళువ యువకులు స్పందించి, పులయులకు విద్యాలయ ప్రవేశం కల్పించేవారు.

స్వామి తన అద్వైత భావనను నిత్యజీవితంలో, సామాజిక విషయాల్లో అమలుపరిచి శంకరాచార్యుని మించిపోయాడు. అందుకే స్వామి నిజమైన గురువుగా గురువేదాంతిగా, గురుబ్రహ్మగా, గురు సేవకుడుగా, గురునాయకుడుగా, సర్వార్థగురువుగా కేరళ దేశమంతటా ప్రసిద్ధి చెందాడు.

1916లో గురుస్వామి తిరువణ్ణామలై వెళ్ళి రమణమహర్షిని దర్శించాడు. మహర్షి పై "మునిచర్యా పంచకం" సంస్కృతంలో రచించాడు.

తలక్రింద మోచేయి / మొల క్రింద నులిచాప
కాలిక్రింద నేల / గల నిర్ధనమునికి
'తత్త్వమసి' అబ్బింది / ఉత్తమసిరివచ్చింది
ఆనందమానంద మది ఉత్తమోత్తమం. (మొదటి శ్లోకం)

నిచ్చెనమెట్ల కులసమాజంలో ఒకస్థాయిలో ఉన్న యళువాలు తమ పైవారికున్న హక్కులు పొంద పోరాడుతూ గురువు వెంట నడుస్తున్నారు. కాని తమకంటే దిగువలో ఉన్న పులయులకు, పరియులకు ఆ హక్కులు దక్కడానికి ఇష్టపడడం లేదు. ఇది యెళువాలవల్ల గురువుకు వచ్చిన సమస్య. తాము మానవహక్కులు పొందడానికి ఎప్పుడు సమర్థులవుతారంటే, ఇతరులు ప్రాథమిక హక్కులు పొందడానికి తాము అవరోధం కల్పించనపుడే. అదియే స్వేచ్ఛకు ముందడుగు. అలా యళువాలకు శిక్షణ ఇవ్వాలని స్వామి ఉద్దేశించాడు. ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకొన్నది. ఈ విషయంలో సహోదరన్ అయ్యప్పన్ సమాజంలో విప్లవ తుఫాను సృష్టించాడు.



అందుకు స్వామి ప్రచారం ముమ్మరం చేశాడు. ఆయన ఆశయం అగ్నిలా వ్యాపించింది. ఏళువ యువకులు కొందరు పులయ విద్యార్థులను స్వాగతించారు. బడి తలుపులు తెరిచారు. అలాంటి పాఠశాలలను స్వామి సందర్శించాడు.

పులయ బిడ్డల నాహ్వానించిన పాఠశాలల్లో, శ్రీధరస్వామిఆశ్రమ పాఠశాల ఒకటి. అది 'పెరింగలె' లో ఉంది. స్వామి అక్కడికి వెళ్ళాడు. అచ్చటి సానుకూల వాతావరణానికి ముగ్ధుడయ్యాడు. పులయ విద్యార్థులను వేదికపైకి పిల్చాడు. వాళ్ళను సత్కరించాడు. సభలో ఒక పులయవిద్యార్థిని మాట్లాడమన్నాడు. "బ్రహ్మశ్రీ నారాయణ గురుస్వామిని చూడడం నాకు మహదానందంగా ఉంది. ఆయన దీర్ఘకాలం జీవించుగాక!" అని అతడు వేదిక దిగిపోయాడు. ఆ బిడ్డను స్వామి తనవెంట తీసుకొని వెళ్ళి స్వహస్తాలతో అతనికి ఆహారం తినిపించాడు. అతని పేరు "కున్హన్". కుమారన్ అని స్వామి నూత్న నామకరణం చేశాడు. పులయవిద్యార్థులను కొందరిని అల్వాయె అద్వైతాశ్రమంలో చేర్చుకొని చదువు చెప్పించాడు. వాళ్ళచే ఆహారం వండించి, అతిథులకు వడ్డింప జేసేవాడు. వడ్డించేటప్పుడు తమ కులాన్ని వ్యక్తపరచమనేవాడు. లోలోపల ఎవరేమనుకున్నా బయటికి పల్లెత్తు మాట అనేవారు కాదు.

1916లో త్రివేండ్రం దగ్గర ముట్టత్తార పులయ సమావేశంలో స్వామి ఇలా మాట్లాడినాడు. చదువు, ధనం, పరిశుభ్రత మున్నగు వాటిలో తేడా లుండవచ్చు గాని గుణంలో తేడా లేదు. అందరం ఒకటే.

"పులయులకు విద్యాసంపదలు లేవు. వాటిని వారికి సమకూర్చాలి. వాళ్లను విద్యావంతులు చేయాలి. డబ్బు ఉంటే మిగతావన్నీ వచ్చి చేరతాయి. నిజానికి డబ్బు లేదనడం తప్పు. మీకు మీరే ధనం; మీ చేతిలో పనే మీకు ధనం. డబ్బు వృథా చేస్తారు. తాగుడుకు తగలేస్తారు. నిల్వ చేసుకుంటే పిల్లలను చదివించుకోవచ్చు. ప్రతినెలా కలవాలి. చర్చించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలి. తాగుడు అలవాటు మానుకోవాలి. అప్పుడు ఇతరులు తోడ్పడతారు. మళ్ళీ మళ్ళీ మిమ్మల్ని కలవాలని ఉంది" అని ముగించాడు.

**ఆలయాలవల్ల దురాచారాలు తొలగవు**

ఆలయాలు కొత్తవి, కాని భక్తులభావాలు పాతవే. ఇది స్వామి గ్రహించాడు. దురాచారాలు, దుశ్చేష్టలు తొలగడం కష్టంగా ఉంది. దిగువజాతుల పట్ల ద్వేషం యథావిధిగా పని చేస్తోంది. ఇది మానవ దయనీయ స్థితి. ప్రజల్ని పవిత్రీకరించడానికి గుడిగోపురాలు కావలసిందే గాని, అవే మూర్ఖవిశ్వాసాలకు, చెడు మార్గాలకు నిలయాలవుతున్నాయని స్వామి గ్రహించాడు. వాటి ద్వారా ఆశించిన సంస్కరణలు జరగడం లేదని స్వామి విచారగ్రస్తుడయ్యాడు.

1917లో స్వామి మరో సందేశమిచ్చాడు. "ఇక మీదట ఆలయ నిర్మాణం ప్రోత్సహించరాదు. ప్రజలకు గుళ్లపై విశ్వాసం సన్నగిల్లుతోంది. చాలాధనం గుళ్లపై ఖర్చుపెట్టడం విచారకరంగా ఉంది. కాలం చాలా మారింది. గుళ్లు కావాలనేవారు చిన్న చిన్నవి కట్టుకోవచ్చు; కానీ బడియే పెద్ద గుడికావాలి. ప్రజాధనంతో పాఠశాలలు కట్టాలి. గుళ్లవల్ల కుల భేదాలు తొలగిపోతాయనుకున్నాం. కానీ అనుభవం వేరుగా ఉంది. గుళ్లు కులాలను స్థిరపరుస్తున్నాయి. ఇక మీదట చదువుకు జ్ఞానార్జనకు గట్టి ప్రయత్నాలు చేయాలి. అదొక్కటే ప్రజల్ని ఒక్కటిగా చేసే విధానం".



**అనుచరగణం**

**సహోదరన్ అయ్యప్పన్**

శ్రీస్వామిని ఇటీవల మిక్కిలిగా ఆకర్షించిన యువకుల్లో అయ్యప్పన్ ప్రముఖుడు. అతడు స్వామి సన్నిహిత మిత్రుడైన చెరై అచ్యుతన్ వైద్యార్ చిన్న తమ్ముడు కావడం మరో విశేషం. అతడు ఆల్వాయె ఆశ్రమంలో స్వామిని చూడడానికి మద్రాసు నుండి వచ్చాడు. త్రివేంద్రం మహారాజ కళాశాలలో తన చదువు కొనసాగించ దలచాడు. అందుకు స్వామి తగిన వారికి సిఫార్సుచేసి సహాయపడ్డాడు.

అయ్యప్పన్ విద్య పూర్తిచేసుకొని మళ్ళీ స్వామి వద్దకు వచ్చాడు. తాను శక్తిమంతుడైన రచయిత, అనర్గళమైన వక్త అయ్యాడు. స్వామి 'ఏకవర్ణ' సిద్ధాంతంపై అనేక కరపత్రాలు పంచిపెట్టాడు. ఎక్కడ పడితే అక్కడ మత ప్రచారకుల్లాగా ప్రజలనుద్దేశించి ప్రసంగించడం మొదలు పెట్టాడు. దురాచారాలు, మూఢనమ్మకాలు, అంటరానితనం మున్నగు అభ్యాసాల నుంచి వైదొలగమని యళువాలకు, దిగువవర్గాల వారికి ప్రబోధం చేశాడు. అప్పుడు మాత్రమే అగ్రకులాలతో సమానంగా ఉండడానికి వీలవు తుందన్నాడు. సహపంక్తి భోజనాల పథకం అన్ని కులాల వారిని పిలిచి అమలు పరిచాడు. పులయులతో కలిసి భోంచేయాలని ఒక ప్రచార సంఘాన్ని పెట్టాడు. 1917 మే 27 న ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఇద్దరు పులయ కుర్రవాళ్లను, కష్టంమీద, పట్టుకొచ్చాడు. వాళ్లతో కలిసి భుజించాలని గొప్పగా ఉపన్యసించాడు. "కుల నిర్మూలన జరగాలి. శ్రీ నారాయణ గురు సందేశాలు పాటించాలి. ముందుగా దిగువకులాల వారికి సమాన హోదా కల్పించాలి. ఇద్దరు పులయ పిల్లలతో మనం కలిసి తినాలి. "కుల విభేదాలు అనైతికం, హానికరం, అనవసరం; వాటిని తొలగించడానికి 'నేను అన్ని రకాలైన, న్యాయపద్ధతులు అమలు పరుస్తానని హృదయంలో

ప్రతిజ్ఞ చేస్తున్నాను' అని శ్రోతలతో పలికించాడు. అందరూ విందులో పాల్గొన్నారు.

మరునాడు రాష్ట్రమంతటా అలజడి చెలరేగింది. ధర్మం ధ్వంసమైందని గగ్గోలు పెట్టారు. శతాబ్దాలుగా సాగుతున్న పవిత్ర ఆచారాలు మంట కలుస్తున్నాయంటూ మండిపడ్డారు. విందులో పాల్గొన్నవారి కుటుంబాలను యళువాసంఘం, విజ్ఞాన వర్ధిని సభ వెలివేసింది. అయ్యప్పన్‌ను పులయున్ అయ్యప్పన్ అని గేలిచేశారు. అది తనకు గర్వకారణమన్నాడు అయ్యప్పన్. కులాంతర విందు స్వామికి ఇష్టం లేదని కొందరు దుష్ప్రచారం చేశారు. వెంటనే అయ్యప్పన్ స్వామి వద్దకు వెళ్లాడు. "వ్యతిరేకుల తాటాకు చప్పుళ్లకు జంక పనిలేదు. ఇది ఒక ఉద్యమంగా రూపొందుతుంది. ఇది గుర్తుపెట్టుకో వారిని క్షమించు" అని స్వామి సమర్థించాడు.

అయ్యప్పన్ స్వామి ఆశయాలు నెరవేర్చు ఉద్దేశంతో "సహోదర సంఘం" పెట్టాడు. స్వామి దానిపై తన సందేశం ఇచ్చాడు. మతం, దుస్తులు, భాష వేరుగా ఉన్నా మనుషులందరూ ఒకే జాతికి (species) చెందినవారు గనుక అంతర్వివాహాలకు, కలిసి భుజించడానికి అభ్యంతరం లేదు" ఈ అభిప్రాయాలు గల కరపత్రాన్ని వేలాదిగా పంచిపెట్టారు. ఈ సంఘం 'సహోదరన్' అనే మాసపత్రిక ప్రారంభించింది (1917). "మనిషికి కులం, మతం, దేవునితో పనిలేదని పత్రికలో సంపాదకీయం వ్రాశాడు. అలా ఉండడం దైవం పట్ల భక్తి అవుతుందని స్వామి వివరించాడు. అది తప్పని ఖండించలేదు. మానవాళికి సేవ చేయడమే దైవారాధన అని స్వామి అనేక మార్లు చెప్పాడు.

అయ్యప్పన్ 'శ్రీనారాయణ గిరి' అనే కొండపై మరో సేవాసంఘం స్థాపించాడు. దానిపేరు శ్రీనారాయణ సేవిక సమాజం. ఈ సంఘం పార్వతి



అయ్యప్పన్ నాయకత్వంలో నడిచింది. సహోదరన్ అయ్యప్పన్ 1968 వరకు జీవించి ఘనమైన మానవ సేవ చేశాడు.

**సి. కృష్ణన్**

స్వామి అభిమానులు లక్షల్లో ఉన్నారు. స్వామి సిద్ధాంతాలు నమ్మిన వారు వేలల్లో ఉన్నారు. ప్రచారకులు వందల్లో ఉన్నారు. కలిసి ఉధృతంగా పనిచేస్తున్న వారు పెక్కురున్నారు. సుప్రసిద్ధులైన వారు ఎందరో ఉన్నారు. అందులో మరీ ముఖ్యమైన వారెవరనగా: డా॥ పల్పు, యన్.కుమారన్ అసన్, టి.కె.మాధవన్, సి.వి.కున్నికా రామన్, ఇ.కె.అయ్యకుట్టి, కె.అయ్యప్పన్, మూయ్యత్ కుమారన్, కోట్టియత్ రాముని మున్నగు వారున్నారు.

అలాంటి వారిలో సి.కృష్ణన్ ఒకరు.అతడు ఉత్తరదక్షిణాదివారలకు బంగారంలాంటి అనుసంధాన కర్త. 1867లో జన్మించాడు. యువకుడు, 'లా' విద్యార్థి, ఉత్సాహవంతుడు, రచయిత. క్యాలికట్‌లో 'లా' ప్రాక్టీసు చేసేవాడు. డా॥పల్పుకు సన్నిహితుడైనాడు. మత విశ్వాసాలు, దైవారాధనలు లేనివాడు. అయినా నారాయణ గురు అంటే అత్యంత అభిమానం పెంచుకున్నాడు. సేవాకార్యాలలోనే గాక మతకార్యక్రమాలలో కూడ సహకరించేవాడు. సామూహిక అభ్యుదయం అతనికి ముఖ్యం. స్వామి అతణ్ణి తన సంస్థలన్నింటి లోను ధర్మకర్తగా చేర్చుకోవడమేగాక, 1919 మే 16న అతనికి సర్వాధికారపత్రం అటార్నీ వ్రాసి ఇచ్చాడు. అతడు 'మితవాది' మాసపత్రికను ప్రారంభించి, వార్తాపత్రికగా మార్చాడు. నిమ్నజాతులకు మరింత మేలు జరగాలంటే బ్రిటిషు వారి పాలన కొనసాగడం మంచిదన్న అభిప్రాయమున్న వాడు. స్వామి కూడ ఆంగ్లేయులను అభిమానించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులకు విజయం చేకూరాలని ప్రార్థించమని స్వామి శిష్యులకు చెప్పాడు.

**"విద్యద్వారా స్వేచ్ఛ, సంఘం ద్వారా శక్తి, పోరాటం ద్వారా సాంఘిక న్యాయం"** అని స్వామి ఇచ్చిన నినాదం. తన పత్రికకు మూలసూత్రంగా పెట్టుకున్నాడు.

అతడు కాంగ్రెసు అభిమాని కాకపోయినా, నిమ్నజాతుల వారు. ప్రజారహదారులపై నడిచే హక్కుకై కాంగ్రెసు తలపెట్టిన వైక్కంసత్యా గ్రహానికి కృష్ణన్ విరాళం ఇవ్వడమేగాక అన్ని విధాల తోడ్పడ్డాడు.

**బహుముఖ సంస్కరణలు**

సాంఘిక సంస్కరణల తీరు తెన్నులు, వాటిని అమలుపరచ వలసిన విధానం శివగిరిలో నిర్వహించిన సర్వమత సమ్మేళనంలో 'స్వామి వివరించాడు. పెళ్ళి సందర్భాలలోను, చావు సమయాలలోను పాటించాల్సిన విధులు చాలా సరళంగా, తక్కువ సమయంలో తక్కువ ప్రార్ధనలతో కనీస ఖర్చులతో, నిరాడంబరంగా, కొంత సహేతుక దృష్టితో జరపాలన్నాడు. తన సూచనల మేరకు స్వామి స్వయంగా కొన్ని కుటుంబాలలో జరిపించాడు. అభాగ్యులకు, అనాథలకు సహాయపడుటకు ధర్మకర్తృత్వ సంస్థ (charitable institution) ఉండాలని చెప్పాడు.

ఈ కేంద్రాలు విరాళదాతల హృదయాలను మరింత విశాలపరచాలని, పవిత్రీకరించాలని భావించాడు. ప్రతి సంస్థ సాంస్కృతిక కేంద్రం కావాలనీ, దానితో స్నేహమున్న ప్రతి మనసు సంపన్నం కావాలని చెప్పాడు. అలాంటి సంస్థ పార్వతి అయ్యప్పన్ (సహోదరన్ అయ్యప్పన్ భార్య) నాయకత్వంలో పనిచేస్తున్న శ్రీ నారాయణ సేవికా సమాజంలో విలసిల్లుతుందని ఆశించాడు. ఆ సంస్థ "తొట్టు ముఖం" నారాయణగిరిలో ఉంది.

నారాయణగురు తీరికలేని పర్యటనాకార్యక్రమం పెట్టుకున్నాడు. విరాళాలు వసూలు చేయడమేగాక, ప్రజల ఆచారవ్యవహారాల్లో, నమ్మకాల్లో



మార్పు తీసుకొనిరావడం ఆయన ఉద్దేశం. ఆయనే అనేక చోట్ల నీచదేవతా విగ్రహాలను తొలగించాడు. స్వామి ఎక్కడికి వెళ్ళినా అందరూ ఉత్సాహంతో స్వాగతించేవారు. యెళువాలు, బ్రాహ్మణులు, నాయర్లు, ఇతర మతాలవారు సైతం ఆయన ఆశీస్సులు కోరేవారు. తమ సమస్యలు చెప్పుకొనేవారు. ఆ యా పర్యటనల్లో గ్రామసభలు ఏర్పాటు చేయించేవారు.

కొట్టుకల్‌లో ఎళువాలకు క్రైస్తవం స్వీకరించిన ఎళువాలకు మధ్య వైరమేర్పడింది, తీవ్రమైంది. స్వామి క్రైస్తవ యెళువాలను తిరిగి హిందువులుగా మార్చాడు. అందర్నీ కలిసి బ్రతుకమన్నాడు.

అక్కడ 'పులయ' నాయకులు స్వామిని కలిశారు. స్వామి సంతోషాంత రంగుడయ్యాడు. పులయులకు బహిరంగంగా సహాయం చేయమని, తమ ప్రయత్నాలు ముమ్మరం చేసి సమృద్ధిగా తోడ్పడమని ఎళువాలకు సలహా ఇచ్చాడు. ఉపాయశాలియైన మానవుడు ప్రక్కవాని సౌభాగ్యానికి కృషి చేయాలన్నది స్వామి సందేశం.

కొన్ని గ్రామాలలో ఆరాధనా విధానమే మార్చివేశాడు. దేవతలకు మాంసం పెట్టడం మాన్పించాడు. కొత్త విధానం ప్రవేశపెట్టాడు. కొట్టార్‌లో అసహ్యాకరమైన రాక్షస విగ్రహాలను తొలగించాడు; జంతు బలులను నిషేధించాడు. మార్పు చెందిన వాళ్ల భక్తికి, ఆసక్తికి, శుభ్రతకు స్వామి ముగ్ధుడైనాడు.

**షష్టి పూర్తి**

స్వామి అద్వైతాశ్రమంలో ఉన్నాడు (1916). ఆల్వాయి నదికి స్నానానికి వెళ్లాడు. ఆశ్రమానికి తిరిగి వచ్చేసరికి జనం గమిగూడి ఉత్సాహంగా ఎదురువెళ్ళారు. చేతిలో పూలు, పూలహారాలు, పండ్లు, ఫలాలు, హారతులు పట్టుకొని స్వాగతించారు. ఆ చిత్రం, సన్నివేశం చూడాల్సిందే. అభిమానుల

శ్రద్ధా భక్తులకు స్వామి ప్రసన్నహృదయుడయ్యాడు. అందరూ తమ తమ సమర్పణలు కావించారు. తండ్రిలా హృదయాంతరంగాన పొంగిపోయాడు. కొందరు పాడారు, స్తుతించారు, కీర్తించారు, దీర్ఘాయువునకై అభినుతించారు. స్వామి ప్రశాంతస్థితిలో ఆసీనుడయ్యాడు. గురువును బ్రహ్మసమానంగా భావించారు భక్తులు.

స్వామికి అరువది ఏండ్లు నిండాయని ఆశ్రమ వాసులు ఆడంబరంగా షష్టి జయంతి చేయదలచారు. వలదని స్వామి వారించాడు. సామాన్యంగా జరిపారు. కేరళ ముఖ్య పట్టణాలన్నింటిలో మధురై, తిరునల్వేలి మద్రాసు, కలకత్తా, సింగపూర్, కొలంబో మున్నగు చోట్ల అత్యంతవైభవంగా జరుపుకున్నారట. కేరళ మారుమూల గ్రామాలలో కూడ నారాయణ గురు జన్మదినం ఒక ప్రజాపండుగలాగ జరుపుకున్నారంటే ఆయన జనబాహుళ్య జీవితంలో ఎంతగాఢంగా ప్రవేశించాడో అర్థమవుతుంది.

నారాయణగురుకు ఆ రోజుకూడ సర్వసాధారణదినం. ప్రజలకు పర్వదినం. వివిధ మత విశ్వాసాలప్రజలు వారి చెంతకు వచ్చారు. నది వంక చూస్తూ మాట్లాడడం జరిగింది.

“ఈ నది ఇప్పుడు చాలా పరిశుభ్రంగా ఉంది”. చిరునవ్వుతో మళ్ళీ చెప్పాడు. “మనజీవితం కూడా అలా శుభ్రం కావాలి. జీవితం చాలా మురికిగా ఉంది. దాన్ని పరిశుభ్రం చేయడమే ఇప్పుడు జరగాల్సింది.”

అసాధారణ రీతిలో ప్రపంచ మంతటా, అనగా ఎక్కడెక్కడ మళయాళీలు ఉన్నారో ఆ ప్రదేశాలంతటా, మహా వైభవంగా షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. ఇక కేరళలో సరేసరి! వెలుగులు ఆకాశమంతట విరజిమ్మినాయి. కైటాముక్కు (త్రివేంద్రం)లో నిర్మించిన షష్టి పూర్తి సంస్కరణ భవనమును ట్రావంకోర్ దివాను ఆరోజున, ఆవిష్కరించారు. మహాప్రభువైన,



ఎ.ఆర్.రాజరాజువర్మతో పాటు ఉట్లార్ యస్.పరమేశ్వర అయ్యర్ మున్నగు ఘనులెందరో హాజరయ్యారు. ఇలాంటి మహాదోత్సవం, ఇంత అద్భుతమైన తీరులో కేరళలో మునుపెన్నడూ జరగలేదని గ్రామీణులు సైతం వేనోళ్ల కొనియాడారు.‘నారాయణ గురుస్వామి’ నిజమైన ‘మహాత్ముడ’ని పొగిడారు. మహారాజులకు కూడ ఇలాంటి అదృష్టం అబ్బలేదన్నారు. మహారాజులు అదృష్టంతో పుడతారు. ఈయనయితే ‘చెంపళంతి’ మారుమూల గ్రామంలో, పూరిపాకలో పుట్టి, దివ్యత్వం పొంది, బ్రతికుండగానే దేవుడి స్థాయికి ఎదిగాడని ఆకాశంవైపు జూసి, దండంపెట్టిన వాళ్లున్నారు. ఈయనలా తపస్సులో మున్గి, భగవత్కృప పొందినవారు ప్రపంచంలోనే లేరని ముక్కున వేలేసుకున్న వారున్నారు. సర్వోన్నత గుణగణాలు, తులలేని మత విశ్వాసం, ప్రగాఢ వేదాంత వైదుష్యం, లోతైన ఆధ్యాత్మికత, అపారకరుణ, ప్రపంచ క్షేమం పట్ల అంతులేని ఆసక్తి అతన్ని ఆవహించి అతన్ని మత నాయకునిగా, సంఘసంస్కర్తగా తీర్చిదిద్దాయని ఎవరికి తోచినట్లు వారు గొప్పలు ప్రకటించారు. ఈ ప్రకటనలను సంభాషణలను కుమారన్ అసన్ ‘వివేకోదయం’ లో ప్రకటించాడు.

జంతుబలులతో దైవిక సంతృప్తి చెందే కొందరు స్వామి దర్శనానికి వచ్చారు. “మీరు జంతుబలి ఎందుకు మానుకోరు” అని ప్రశ్నించాడు. వాళ్ళేదో చెప్పబోతుంటే ఒక సందర్శకుడన్నాడు “గుమ్మడికాయ బలి ఇవ్వొచ్చు” అన్నాడు. “కత్తి బట్టే పురోహితుని కొడుకును బలి ఇవ్వొచ్చు గదా” అన్నాడు స్వామి.

ఇంతలో కొత్త వాళ్ళు వచ్చి, వాళ్ళ గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠకు స్వామిని ఆహ్వానించారు. “గుళ్ళెందుకు, గబ్బిలాలు, చీకటి చేరడానికా? అవి చాలా పరిశుభ్రంగా ఉండాలి. విగ్రహం బదులు లాంతరెందుకు పెట్టగూడదు?” అన్నాడు.

కాంచీపురం నుంచి బ్రాహ్మణులు వచ్చారు. స్వామిని ఆహ్వానించారు. వేదాంతంపై సంభాషించారు. స్వామి, వాళ్ళ అనుమానాల్ని స్పష్టమైన అరవంలో మాట్లాడి, తీర్చాడు. వాళ్ళ ఆహ్వానం అంగీకరించాడు. వాళ్ళు వెళ్ళక ముందే మద్రాసు నుంచి సదాశివ అయ్యర్, కృష్ణన్ అనే హైకోర్టు జస్టిస్‌లు ఏతెంచి స్వామిని మద్రాసుకు ఆహ్వానించారు. స్వామి అంగీకరించాడు.

## మద్రాసు ప్రయాణం – కులంపై చర్చ

మరుసటి నెలలో స్వామి రైలులో బయలుదేరాడు. తోడుగా ఇద్దరు శిష్యులున్నారు. రైలులో కీచులాటలు, సర్దుకు పోవటాలు చూశాడు. కిటికీలో గుండా ఎప్పటికప్పుడు దాటిపోయే ప్రకృతి దృశ్యాలు గమనించాడు. జీవితమంతా కలలోలాగా కరిగిపోతుంది అన్నాడు.

ప్రక్క సీటులో మనిషి "నీపేరేమిటి" అన్నాడు.

"నారాయణ"

"నీ కులమేంటి"

"మీ రేమనుకుంటున్నారు?"

"చూసి చెప్పలేకున్నాను"

"చూసి చెప్పలేకపోతే, విని ఎలా అర్థం చేసుకుంటావు?"

ఇక మాట్లాడలేదు.

మద్రాసులో ఈ సంభాషణ ప్రస్తావనకు వచ్చింది. "ఉన్నది ఒకే కులం అనేకం లేవు" అని స్వామి పక్కున నవ్వాడు.

"నిమ్నజాతి ప్రతినిధి ఒకరు" బ్రాహ్మణ జందెం తగలబెట్టాలి అన్నాడు.

"సరే, ఈ ఉత్సాహంతో వేడెక్కిన వారు అరడజను మంది ఉంటే, కుల వ్యవస్థను కూలదోయవచ్చు, మానవులందరూ ఒకే జాతి (species)



అని చెప్పడానికి ప్రత్యేకమైన ఋజువు అవసరం లేదు. కుక్క మరో కుక్కను జూసినప్పుడు అది తనజాతిదేనని వెంటనే గుర్తిస్తుంది. ప్రతిజంతువుకు ఈ సామర్థ్యం ఉంది. ఈ విషయంలో మనిషి మాత్రమే వెనకబడ్డాడు. అతను జంతువుల కన్నా హీనమైనాడు". శ్రోతల్లో చలనమొచ్చింది, ఉలిక్కిపడ్డారు. లోలోన కలవరించారు, వాళ్లకు నవీన సమకాలీన అభిప్రాయాలు గుర్తుకొచ్చాయి.

తన దృష్టిలో కులం అంటూ ఏమి లేదన్నాడు స్వామి. వృత్తుల ఆధారంగా కులాలు పెట్టడం కూడ తప్పు అన్నాడు. అలా చేయడం మానవ స్వేచ్ఛను, తెలివిని హరించిందన్నాడు. స్వేచ్ఛ, తెలివి లేకపోతే వృత్తి మాత్రం ఎలా వృద్ధి చెందుతుంది అని ప్రశ్నించాడు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి మొదలగు వారు అజ్ఞాన వర్గంగా తయారయ్యారు. కులవ్యవస్థ వృత్తిని కూడ నాశనం చేస్తుంది. అది పనివాని నేర్పరితనాన్ని తగ్గిస్తుంది. చుట్టుప్రక్కల ఏం జరుగుతుందో తెలియకపోతే తనపని తాను సరిగా చూసుకోలేడు. ప్రజలు కూడ అతని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేరు?

కనుక కులంతోపాటు వృత్తికూడ మంచిది కాదని స్వామి వివరించాడు.

"తండ్రివృత్తి కుమారుడు ఆభిజాత్యంగా పొందుతాడని శాస్త్ర విజ్ఞానవేత్తలు అంటారు గదా!" – ఒక భక్తుడు

"ఆ పరిస్థితిలో కూడ కులంతో పనిలేదు" – అన్నాడు స్వామి. "అంతేకాదు, కుమారులు సహజంగానే తండ్రి వృత్తిలో ప్రవేశిస్తారు. ఎవరూ ఒత్తిడి చేయాల్సిన పనిలేదు. సంపూర్ణ స్వేచ్ఛ ఉండొచ్చు. మనిషి స్వేచ్ఛను హరించడంలో ఏవిధంగానూ ప్రయోజనం లేదు. నేర్చుకోడానికీ, తనకు నచ్చిన పనిలో ప్రవేశించడానికీ ప్రతివానికీ స్వేచ్ఛ ఉండాలి."

"అలాంటి స్వేచ్ఛ మొండితనంగా పోటీ తత్వం పెంచుతుంది" అన్నాడు భక్తుడు.

దానివల్ల లాభం పొందేవారు అలాగే మాట్లాడతారు. వాళ్ల సుఖానికి ఇతరులు శ్రమపడాలి. మనిషి తన సుఖం కొరకు, ప్రపంచం సుఖం నిమిత్తం బ్రతకాలి. అలా మనిషిని దిగజారిస్తే దానివల్ల ఉపయోగమేంటి? అందుకే నేను కులవ్యవస్థ పోవాలంటున్నాను. అది మనిషిని అణచివేస్తుంది. కనుక అనవసరం. కులం అనేది లేదు. అది ఉందని భావించడం భ్రమ".

**కాంచీపురంలో ఆశ్రమం**

కాంచీపురంలో శ్రీనారాయణ సేవ ఆశ్రమం ప్రారంభించాడు. అది ఆల్వాయె ఆశ్రమానికి శాఖగా పనిచేసేటట్లు కట్టుదిట్టం చేశాడు. ఆశ్రమానికి అనుబంధంగా ఆయుర్వేద చికిత్సాలయం నెలకొల్పాడు. పేదలకు ఉచిత సేవ జరపాలన్నాడు. "ప్రజల బాధలు తొలగించడం మనధ్యేయం, మానవాళికి సేవచేయుట ద్వారా మాత్రమే దైవాన్ని సేవించవచ్చు" అని చెప్పాడు.

**మళ్లీ మద్రాసు**

మద్రాసులో భక్తులు గుంపులు గుంపులుగా ఎడతెరిపి లేకుండా స్వామి వారిని దర్శించుకొన్నారు.

భక్తుల కోర్కెపై చింతాద్రిపేటలో ఒక ఆశ్రమం స్థాపించాడు స్వామి మద్రాసులో గుర్రపు బండి ఎక్కడానికి నిరాకరించాడు, రిక్షాను కాదనలేదు. ఎందుకంటే రిక్షా ఎక్కమని మనిషి కోరతాడు, గుర్రం కోరదు అన్నాడు. ప్రతి విషయం సూక్ష్మంగాను, సున్నితంగాను పరిశీలించడం ఆయన ప్రత్యేకత. జంతువుల పట్ల అత్యంత జాలి జూపడం ఆయన స్వభావం; కఠినంగా, క్రూరంగా వ్యవహరించడం ఆయనకు గిట్టదు. వేదాంతం అంటే జీవించడం, సేవించడం నేర్పేదిగా ఉండాలన్నాడు. అది త్యాగం నేర్పాలి,



ధైర్యం ఇవ్వాలి. అసత్యం నుండి సత్యం గుర్తింపజేయాలి – ఇదీ వారి మాటల్లో అర్థం.

**బెంగళూరులో**

స్వామి మద్రాసు నుండి బెంగళూరు వెళ్లాడు. డా॥పల్పు ఇంట కొద్ది రోజులున్నాడు. అతని మైత్రి, నిర్మోహమాటమైన మాటలు స్వామికి ఇష్టం. పల్పు ఇలా అన్నాడు. "మనం తెలివితక్కువ వారిగా ఉండాలి స్వామి; ఎందుకంటే తెలివితక్కువవారు ఇతరులకై బ్రతుకుతారు". స్వామిఫక్కున నవ్వాడు. "నవ్వినంత మాత్రాన చాలదు స్వామి; మనం ఎంతో చేయాలి. పరిశ్రమలు పెట్టాలి. మాటలు చెపితే సరిపోదు. ప్రజలకు శిక్షణ ఇవ్వాలి. విద్యాసంస్థలు ఎక్కువ చెయ్యాలి. గుళ్ళుకట్టి, ఆచారాలు మార్చితే చాలదు. వాటితో సంతృప్తి పడితే స్వామి కూడ ప్రీస్టు (పూజారి) అయిపోతాడు, పాతవంచకుల్లో చేరిపోతాడు" అనే సరికి స్వామిముఖంలో మరింత మందహాసం తాండవించింది. ఇంకా ఇంకా చెప్పమని డా॥ పల్పును ప్రోత్సహించాడు.

**"స్వామీ, మాటలు సరిపోవు. క్రియలు కావాలి. ప్రజలు అజ్ఞానులు, సోమరితనంగా బ్రతుకుతారు. ఏం చేయాలో వాళ్ళకు తెలియదు, వాళ్లను ఉద్ధరించాలి. ప్రోత్సహించాలి."**

"మనం అందుకే పనిచేస్తున్నాం" అన్నాడు స్వామి. "యస్.యన్.డి.పి యోగం ఆ విషయంలోనే పనిచేస్తోంది. కార్యాచరణ మార్గాలు చెప్పండి" అన్నాడు స్వామి.

అంతటితో ఆగక అలాగే చరిత్ర, సామాజిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, వ్యవహార విషయాలు, మున్నగు అనేక అంశాలపై ప్రశ్న

పరంపరలు కురిపించాడు. డా॥ పల్పు ఎన్నెన్నో వివరాలు స్వామి ముందు పెట్టాడు. స్వామి చాలా శ్రద్ధగా స్వీకరించి, వాటిని సమ్మతించే విధానం యోచించాడు.”

స్వామి తర్వాత తన ప్రసంగాలలో “మనం తెలివితక్కువ వాళ్లుగా ఉందాం’ అన్న నినాదం వెలిబుచ్చాడు.

సింహళం ప్రయాణం సందర్భంలో .“విజ్ఞానోదయసభ” వారు విలువైన భూమిదానం చేశారు. దానపత్రం స్వీకరిస్తు ‘‘నేను తెలివితక్కువ ఉద్యమకారుణ్ణి. దీంతో ఏం చేయాలో తెలియదు. నాకు ఆకాశాన్ని నక్షత్రాల్ని దానం చేస్తే ఈ భూసమస్యలు ఉండవు గదా!” అన్నాడు.

**ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం**

శ్రీ నారాయణగురుస్వామి కేరళలో సర్వమత భక్తులకు దైవమైనాడు. అంతేకాదు సకలజన బాంధవుడయ్యాడు. స్వామి రచించిన శ్లోకాలను భక్తులు రోజూ పారాయణ జేస్తున్నారు. అతడు కులదైవంగ, కుటుంబ దైవంగ, విశ్వనరుడుగ పూజనీయుడయ్యాడు.

1920లో తన జన్మదిన సందర్భంగా స్వామి రెండు సందేశాలిచ్చాడు. మొదటి సందేశం:

**“సారా విషం లాంటిది. దాన్ని తయారు చేయొద్దు, అమ్మొద్దు. తాగొద్దు.”** గీతకార్మికుని దేహం దుర్వాసన గొడుతుంది; అతని బట్టలు, ఇల్లు, అతను ఏది ముట్టుకున్నా ప్రతిది వాసనే. తాగుడు జాతి పతనానికి కారణమని, తన కులంవారికి నిర్మొగమాటంగా నిర్దిష్టంగా చెప్పాడు. రెండో సందేశం:

**“మానవాళికి ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం” మానవులందరూ ఒకటే, ఒకే జాతికి చెందినవారని ప్రకటించాడు.**



మనిషికి మనిషికి మధ్య, బ్రాహ్మణునికి పరియాకి మధ్య ఏ వ్యత్యాసం లేదు అని విస్పష్టమైంది. ఒక కులం అంటే వందలాది కులాల్లో ఒకటనా లేక నాలుగు వర్ణాలలో ఒకటనా అని సందేహించ పనిలేదు.

కులంపేరు ఉదహరించలేదంటే, కులమే లేదని అర్థం. మానవత్వమే ఆ ఏకైక కులమని “శ్రీ నారాయణగురు దర్శనమాల” రచయిత ఆర్ కరుణాకరన్ వ్యాఖ్యానించాడు.

అన్ని మతాల ఉద్దేశ్యం ఒకటేనని స్వామి భావించాడు. మతం మనిషిని అభ్యుదయం వైపు నడిపేదిగా ఉండాలన్నాడు. సర్వమత సమావేశంలో ఇలా ప్రకటించాడు: “సత్యమైన దాన్ని, సర్వోన్నతమైన దాన్ని గ్రహిస్తే మతంతో పనిలేదు; మతం మనిషికి అధికారం కాదు. బుద్ధుడు అధ్యయనం చేసింది కేవలం నిర్వాణం పొందడానికి కాదు. అతడు మార్గం కనిపెట్టి, పిదప బోధించాడు. అది బుద్ధిజం అయింది. వేదం అపౌరుషేయం అంటే దాన్ని రాసింది (కనిపెట్టింది) ఎవరో తెలియదని అర్థం. జ్ఞానార్తికి, పరిశీలకునకు నేనిచ్చే సలహా ఇది. సామాన్య మానవునికి శాస్త్రం సాధికారంగా ఉంది. శాస్త్రాల్లోకి అధర్మం ప్రవేశించకుండా మత ప్రబోధకులు చూడాలి. వేదాధికారం అంగీకరించిన దయానందసరస్వతి కొన్ని భాగాలు ప్రక్షిప్తాలని నిషేధించలేదా? మత బోధకు లెల్లరూ ఇలాగే చేయాలి. మత ఘర్షణ తొలగాలంటే, అన్ని మతాల్ని అధ్యయనం చెయ్యాలి. ప్రాథమిక అంశాలలో తేడా లేదని తెలుస్తుంది. అట్టి పరిశీలనా ఫలమే “ఒకే మతం” అని చెప్తున్నాం. సర్వమత సమ్మేళనాసంకల్పం సంఘర్షణల నుండి సంరక్షించే కవచం లాంటిది” అని ప్రకటించాడు.

శ్రీ నారాయణ యొక్క గురువు తైకాటయ్యర్. అతడు గొప్ప బోధకుడు. అతడు తనకంటే ముందువాడైన వైకుంఠ స్వామి అనే మత ప్రబోధకుని

సిద్ధాంతాలు నమ్మాడు. వైకుంఠస్వామి "ఒకే కులం, ఒకే మతం ఒకే దైవం, ఒకే ప్రపంచం' అనే సూత్రం వెలువరించాడని (ఈ రచయిత 2012లో) కేరళీయులతో పరిశీలనాత్మకంగా చర్చించినపుడు తెలిసింది.

## సింహళ యాత్ర

శ్రీలంక షష్టిపూర్తి స్మారక సంఘం అహ్వానంపై ఆగష్టు 1918లో స్వామి శ్రీలంక చేరాడు. భక్తుల కోర్కెపై కాషాయ దుస్తులు ధరించాడు. "ఈ దుస్తుల్లో దుమ్ము కనబడదు" అన్నాడు. స్వామికి సత్యవ్రతానంద తోడైనాడు. అతడు సంప్రదాయక నాయర్. అసలు పేరు అయ్యప్పన్ పిళ్లె. అతడు 1893లో చంగనచ్చేర్రిలో పుట్టాడు. బాగా చదివినవాడు. ఉపాధ్యాయుడు. తనను సమీపించిన ఎళువాలను ఒకప్పుడు కొట్టాడు. స్వామిపై అనుకూల అభిప్రాయం లేకపోయినా చూడాలని అభిలషించాడు. ఆల్వాయెలో పిళ్లె, స్వామిని కలిశాడు. చూడగానే దిమ్మ తిరిగిపోయి దాసుడయ్యాడు. 'మళ్లీ వస్తుందండి' అని స్వామి అనేసరికి ఆశ్చర్యానంద డోలికలలో మునిగిపోయాడు. అతనికి సత్యవ్రతన్ అని స్వామి నామకరణం జేశాడు. అతడు కులరాహిత్యంలో బుద్ధునికి మించిన వాడన్నాడు. సత్యవ్రతన్ వైక్కం సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. అకాల మరణం చెందాడు. స్వామి బాగా చింత పడ్డాడు. అతని ధర్మాలు తప్పక సాగించాలని స్వామి వేనోళ్ల పొగిడాడు. సమానత్వం పాటించడంలో, ప్రవర్తనలో, విశ్వాసంలో అతనికతనే సాటి.

లంకలో స్వామిని రోజుకు 3,4 వందల మంది దర్శించేవారు. ప్రధాన బౌద్ధ బిక్షువు స్వామితో సుదీర్ఘ చర్చలు జరిపాడు. అనేక ఆలయాలను మతసంస్థలను స్వామి దర్శించాడు. మానవుని పుట్టుకకు కారణమేమని ఒక బౌద్ధగురువును అడిగితే కర్మలు అన్నాడు. మొదటి పుట్టుకకు



కారణమేమంటే సమాధానం లేదు. వెంట్రుకలు కట్టిపెట్టిన కొద్దీ బాగా పెరుగుతాయన్నట్లు, నిషేధం వల్ల బౌద్ధ విగ్రహాలు పెరిగిపోతున్నట్లు ఒక మాట అన్నాడు స్వామి. 'మీదేమతమని'? ఓ భిక్షువు అడిగాడు. "నాది కూడ బౌద్ధ మతమే" అన్నాడు స్వామి. 'మీ ఉద్దేశమేంటి' అని మళ్ళీ అడిగారు. "బుద్ధునికి షడభిజ్ఞుడు, దశబలుడు, అద్వయవాది, వినాయకుడు' అనే పేర్లున్నాయి కదా! నేను అద్వయ వాదిని అందుకే నా మతం బౌద్ధం" అని అన్నాడు స్వామి.

ఇరువురికి సంతోషమైంది. సత్యవ్రతానంద ద్వారా లంకలో "విజ్ఞానోదయం యోగం" అనే పేరుతో ఒక సేవాసంస్థ మలయాళుల సంక్షేమం నిమిత్తం, స్వామి ఏర్పాటు చేశాడు. రాత్రిపాఠశాలలు, ప్రార్థనా మందిరాలు స్థాపించాడు. మలయాళీలను చైతన్య పరచడం ఆ సంస్థ విధులు. స్వామి 12 రోజులు శ్రీలంకలో గడిపాడు.

## ఠాగూర్ రాక

స్వామి అంటే సన్యాసి అని లోకం సామాన్యంగా భావిస్తుంది. ఒక నమస్కారం పెట్టి శుభాశీస్సులు కోరుతుంది. స్వామి కూడ ఒక ఆధ్యాత్మిక సందేశమో, ప్రసంగమో ఇచ్చి భిక్షతీసుకుపోతాడు. ఏ స్వామి అయినా భక్తికి దైవానికి పరిమితం.

నారాయణ గురుస్వామి పూర్తిగా వేరై ఉండడం, జీవనక్షేత్రంలో ప్రతి అంశం పట్ల పరిశీలనాత్మకంగా, విమర్శనాత్మకంగా, విప్లవాత్మకంగా, ప్రజాహితంగా ఉండడం వివిధ రంగాలలో ప్రవీణులైన సుప్రసిద్ధులను ఆకర్షించింది.

ఈ క్రమంలో విశ్వకవి, నోబుల్ బహుమానగ్రహీత అయిన రవీంద్రనాథ్‌ఠాగూర్ నారాయణ గురుస్వామిని దర్శించే నిమిత్తం 1922

నవంబరు 22వ తేదీన శివగిరికి ఏతెంచాడు. కేరళీయులు గుంపులు గుంపులుగా ముందుగానే ఆశ్రమం చేరుకున్నారు. స్వామి మాత్రం తాపీగా మామూలుగా కుమారన్ ఆసన్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడు. హఠాత్తుగా లేచి గదిలోనికి వెళ్ళి గడియ వేసుకున్నాడు. తర్వాత గంటసేపటికి సి.యఫ్. అండ్రూస్‌తో సహా రవీంద్రకవి వచ్చి వరండాలో కుడికాలు పెట్టాడు గదిలోనికి పోవడానికి. అదే సమయంలో తలుపు తెరుచుకుంది. స్వామి కుడికాలు ముందుకు పెట్టాడు బయటికి రావడానికి, ఒకరినొకరు చూసుకున్నారు. గౌరవసూచకంగా తలవంచాడు ఠాగూర్. కుమార్ ఆసన్ తెచ్చిన చాపలపై ముగ్గురూ కూర్చొని సంభాషించారు. స్వామిని చూసిన మీదట తన హృదయంలో మార్పు అనుభూతి కొచ్చిందని రవీంద్రుడు పలికాడు. సెలవు తీసుకొంటూ మళ్ళీ తలవంచాడు కవీంద్రుడైన రవీంద్రుడు. ప్రసన్న చిరుదరహాస శుభసూచకంగా స్వామి లేచి నిలుచున్నాడు. అతని రెండు చేతులు తీసుకొని ఠాగూర్ ముద్దాడాడు. నారాయణగురువుకు మించిన ఆధ్యాత్మిక పురుషుని తన ప్రపంచపర్యటనలో ఎవరినీ చూడలేదని ఠాగూర్ ప్రకటించాడు.

## <u>వైక్కం సత్యాగ్రహం</u>

<u>వైక్కం</u> ఒక చిన్న శివాలయ పట్టణం. తిరువాన్కూర్ తీరంలో వెంబనాడు ఒడ్డున ఉంది. నారాయణగురు ప్రభావంతో నడిచిన సంస్కరణలు మతఆధ్యాత్మిక సామాజిక క్షేత్రంలోనే గాక, రాజకీయ రంగాలలోనూ పని చేశాయి. అతని తత్త్వం మానవజీవన అంశాలన్నింటినీ కదిపింది, కుదిపింది, ఉద్ధరించింది. హిందూ సమాజంలో దిగువ వర్ణాల వారు కొన్ని రహదారుల్లో సైతం నడవగూడదనడం విడ్డూరమైన దారుణం. "అవర్ణులకు రహదారుల ప్రవేశం లేదు" అనే సైనుబోర్డు పట్టణ రహదారిలో పెట్టారు. అవర్ణులంటే కులహీన హిందువులు. ఈ బోర్డు తొలగించాలని నిరసన జ్వాలలు చెలరేగాయి. వడయార్ వద్ద సమావేశం జరిగింది (1923). కుమారన్ ఆసాన్ అధ్యక్షత వహించాడు. స్వామి సత్యవ్రతన్, సహోదరన్, టి.కె.మాధవన్ ఉపన్యసించారు. బోర్డు తొలగించాలని టి.కె. తీర్మానం ప్రవేశపెట్టాడు. అసలు బోర్డు పెట్టడమే న్యాయవిరుద్ధం గనుక తీర్మానమే అవసరం లేదు. స్వేచ్ఛగా ప్రవేశించ వచ్చు అన్నాడు. సరేనని, ముగ్గురూ రోడ్డులో నడిచారు. ప్రజలు ఆదుర్దాగా చూశారు. ఏమీ జరగలేదు. మరోసారి మాధవన్ అలానే నడిచి, కొట్టాయం సబ్ మేజిస్ట్రేటుకు లేఖవ్రాసి, ప్రెస్‌కి తెలియపరిచాడు. అప్పుడూ ఎవరూ పట్టించుకోలేదు.



క్విలాన్‌లో జరిగిన యస్.యన్.డి.పి. యోగం వార్షికోత్సవంలో అస్పృశ్యత పాటించడం అన్యాయమని, కాదనేవారిని ఎదిరించమని, ఎళువాలు తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వైకోం ఆలయగోడల ననుసరించి రహదారులున్నాయి. ఈ రోడ్లలో కూడ నిషేధసైనుబోర్డులున్నాయి. ఏళువలు అంతకు దిగువ వాళ్ళు ఈ రోడ్లల్లో నడవరాదు. ఇతర మతస్థులు నడవవచ్చు. గుడిప్రక్కన తోటలో అస్పృశ్యులు కొబ్బరికాయలు ఒలవవచ్చు. ఈ అహేతుకప్రక్రియలు కోర్టుదృష్టికి తీసుకొని వెళ్ళినా వినలేదు. సత్యాగ్రహం చేయాలనుకున్నారు. రాష్ట్ర కాంగ్రెసు ప్రతినిధులు వైక్కం చేరారు (1924). కుమారన్ ఆసాన్, టి.కె మాధవన్ కాంగ్రెస్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. అటూ ఇటూ మాట్లాడారు. సత్యాగ్రహం మొదలుపెట్టారు. టి.కె. మాధవన్ ప్రసంగాలు చేసి, ప్రచారం చేసి, కరపత్రాలు పంచిపెట్టి, జైలుపాలయి, విడుదలై, మళ్ళీ అందోళన ప్రారంభించాడు. అతని కోర్కెపై స్వామి సత్యగ్రహ స్థలానికి వచ్చాడు. అక్కడి ఏర్పాట్లకు స్వామి సంతృప్తి చెందాడు. పాఠశాలలో అంటరాని పులయ కుర్రవాడుండడం స్వామికి మరింత సంతోషం కూర్చింది. ఈ సత్యాగ్రహంలో గాంధీజీ బాధ్యత వహిస్తానన్నాడు. అంతా బాగానే ఉంది. శివగిరి

ఆశ్రమంలో స్వామి డిబ్బి పెట్టి సత్యాగ్రహానికి విరాళాలు వసూలు చేశాడు. తానూ స్వయంగా పెద్ద మొత్తం ఇచ్చాడు.

వైక్కం సత్యాగ్రహంలో కార్యకర్తలకు చాలా కడగండ్లు సంభవించాయి. స్వామి చాలా ధైర్యమిచ్చాడు. సహనం చూపాలన్నాడు. విజయం కన్నా ఓర్పు, పట్టుదల ముఖ్యం అన్నాడు. పరివర్తనకు అది మార్గమన్నాడు. సత్యాగ్రహం దీర్ఘకాలం నడిచింది. స్వామి తరచు సత్యాగ్రహం వివరాలు ఆసక్తిగా తెలుసుకుంటుండేవాడు. సత్యాగ్రహం శిబిరంలో ఎళువాలు, నాయర్లు, నంబూద్రి బ్రాహ్మణులు, ఆకలీలు, పులయాలు అన్ని కులాలవాళ్ళు కలిసి వండుకోవడం, పండుకోవడం, నడుచుకోవడం స్వామికి అమితానందం కల్గించింది. దేవుడు కులాన్ని సృష్టించ లేదు. మనిషి చేసిన పని. కులం కావలసిఉంటే ప్రతి వాణ్ణి బ్రాహ్మణు డనాలి. శూద్రుడని పిలుచుకోవడం నీచం. అలా ఎప్పుడూ చేయరాదని కేశవన్‌తో గట్టిగా చెప్పాడు. కష్టాలకు వెనుకాడవద్దని స్వామి హెచ్చరించాడు. సత్యాగ్రహంపై గాంధీజీ ఒక సందేశం పంపాడు. గాంధీజీ 10 మార్చి 1925న సత్యాగ్రహ సందర్భంగా వైక్కమ్ వెళ్లారు.

**గాంధీజీ కేశవన్ : సందేశంపై ఒక సంభాషణ**

ఉద్దేశ్యం నెరవేర్చాలంటే బాధపడాలి, సత్యాగ్రహ వ్యతిరేకులతో పాటు ప్రభుత్వం యొక్క సానుభూతి కూడ పొందాలని గాంధీజీ సందేశం పంపాడు.

**స్వామి :** బాధపడే సామర్థ్యం ఉండాల్సిందే, వర్షంలో తడవడానికి ఆకలితో చావడానికి కాదు. నిషేధించిన స్థలంలో ప్రవేశించండి, దెబ్బలు తినండి, తిరిగి కొట్టొద్దు. మళ్లీ కంచె వేస్తే ఆగిపోవద్దు, దాటండి. రోడ్లు వాడుకోవడంతో సరికాదు. ఆలయాలలో ప్రవేశించండి. ప్రతి గుడిలోకి పోండి, ప్రతి రోజూపోండి, ప్రతివాడు పోవాలి. వంట సిద్ధమైతే తినండి. విందుకెళ్తే అందరితో పాటు కూర్చోండి. ఇవన్నీ ప్రభుత్వానికి తెల్పండి. ప్రాణం ఒడ్డటానికైనా వెనుకాడొద్దు. ముట్టుకుంటే మలినమనే వాణ్ణి, పరిశుభ్రత విషయంలో శాంతిగా ఉండనీయరాదు. ఇలా నా అభిప్రాయం ప్రచారం చెయ్యండి. పేపర్ల కివ్వండి. నా సమ్మతిని ప్రజలకు తెల్పాలి. ఏమాత్రం హింస ఉండరాదు.



**కేశవన్ :** వైకోం ఉద్యమ ధ్యేయం ఆలయ ప్రవేశం. అది వచ్చే సంవత్సరానికి వాయిదాపడింది.

**స్వామి :** ఎందుకు, ఇప్పటికే ఆలస్యమైంది.

**సర్వమత సమావేశం**

సర్వమత సమావేశం జరపాలన్న స్వామి సంకల్పం 1924లో నెరవేరింది. స్వామి సత్యవ్రతానంద నాయకత్వం వహించాడు. సహోదరన్ అయ్యప్పన్ సహకరించాడు. అల్వాయ్ అద్వైతాశ్రమంలో ఏర్పాట్లు చేశాడు మతాలసారం రాబట్టాలని జన సమైక్యత చేకూర్చాలని, ఉపరితల తేడాల పోరాటం విరమించుకోవాలని ఉద్దేశించారు. ఇది ప్రపంచ సమావేశమైనా, ఏర్పాట్ల దృష్ట్యా ఆహ్వానాలు ఇండియాకు పరిమితం చేసుకున్నారు. సి.వి.కుంజురామన్, టి.కె.మాధవన్ ముందుగానే వచ్చి ఏర్పాట్లలో నిమగ్నమైనారు. స్వామి వర్కల్‌లోను, చుట్టు ప్రక్కల ఊర్లల్లో తిరిగి విరాళాలు సేకరించాడు. "వాదించడం, జయించడం గాక తెలుసుకోవడం, తెలియ జెప్పడం. "ప్రధానసూత్రంగా ముఖద్వారం వద్ద వ్రాయించాడు. సభాధ్యక్షుడు టి.సదాశివ అయ్యర్‌తో పాటు మంజేరి రామ అయ్యర్, మంజేరి రామకృష్ణ అయ్యర్, మితవాది సి.కృష్ణన్ విచ్చేశారు. సరిగ్గా ప్రారంభ సమయానికి స్వామి వచ్చి కూర్చున్నాడు. అతని ప్రశాంత సన్నిధి సభా ప్రాంగణానికి

సాగరగాంభీర్యాన్ని, గురుత్వాన్ని, పూర్ణతను చేకూర్చింది. ఆర్యసమాజ్ ఋషిరామ్, బ్రహ్మసమాజ్‌స్వామి శివప్రసాద్, శ్రీలంక బుద్ధిస్టు, ఇస్లామ్ – మహమ్మద్ మౌలాలి, క్రైస్తవ కె.కె.కురువిల వేదిక నలంక రించారు. స్వామి ఆశీర్వాదం పిదప అధ్యక్షుడు సభ ప్రారంభించాడు. సత్యవ్రతానంద స్వాగతోపన్యాసం పలికాడు. వక్తలందరూ తమతమ మత మౌలిక సూత్రాలు తెలియజెప్పారు. సి.వి.కుంజురమణ ధన్యవాదాలు సమర్పించాడు. రెండురోజుల సమావేశం కాగానే స్వామి సందేశమిచ్చాడు. "మతాల ధ్యేయం ఒకటేనని మత ప్రతినిధులందరూ పలికారు కనుక ఆ యా అనుయాయులు పరస్పరం ఘర్షణ పడనవసరం లేదు. శివగిరి వద్ద ప్రారంభించదలచిన పాఠశాలలో అన్ని మతాల అధ్యయనానికి ఏర్పాట్లు చేస్తాం. సంస్థను సంతృప్తిగా నిర్వహించడానికి గాను ఒక్కొక్కరు ఐదులక్షలరూపాయలు వసూలు చేసి, సహకరించగలందులకు కోరు చున్నాను".

### గాంధీజీ సందర్శనం

గురుస్వామిని కలవడానికి గాంధీజీ 1925లో శివగిరి వెళ్లారు. ఎ.కె.గోవిందదాసు గృహమైన "గాంధీ ఆశ్రమం"లో సమావేశం ఏర్పరచారు. సి.రాజగోపాలచారి కూడ ఉన్నారు.

**గాంధీజీ :** అంటరానితనం పాటించాలని హిందూ శాస్త్రాలలో ఉందా?

**స్వామి :** లేదు.

**గాంధీజీ :** అస్పృశ్యతకు వ్యతిరేకంగా చేసే వైకోం సత్యాగ్రహం గూర్చి స్వామిజీకి వేరే అభిప్రాయమేమైన ఉందా?

**స్వామి :** లేదు.



మతస్వేచ్ఛ గూర్చి మాట్లాడినారు. మతం మారిన వారు స్వేచ్ఛ పొందుతున్నారన్న అభిప్రాయం ఉన్నవారిని నిందించ పనిలేదనీ స్వామి చెప్పాడు.

నిమ్నజాతులలో సైతం అస్పృశ్యత ఉందనీ, స్వామిజీ నిర్మించిన ఆలయాలలో ప్రతివానికీ ప్రవేశం ఉందా, అని గాంధీజీ అడిగినాడు. పులయుల, పరియుల పిల్లలు శివగిరిలో కలిసి చదువుకుంటున్నారనీ, పూజాదులు కలిసి చేస్తారనీ స్వామిజీ చెప్పాడు. చెట్టు ఆకులలాగ కులాలలో తేడా ఉండడం సహజమని గాంధీజీ అన్నాడు. పైకి తేడా కనపడవచ్చుగాని ఆకులుపిండితే పసరు ఒకటి గానే ఉంటుందని స్వామి సమాధానం చెప్పాడు. తర్కం నచ్చిందన్నాడు గాంధీజీ. స్వామిని చూసి మాట్లాడినందుకు గాంధీజీ మిక్కిలి సంతోషం. తృప్తి పొందినట్లు చెప్పాడు. గాంధీజీ అక్కడ రోజంతా గడిపాడు. తర్వాత బహిరంగసభలో ఇరువురు ఒకే వేదిక నుండి మాట్లాడారు. మళ్ళీ మళ్ళీ కలవాలని గాంధీజీ కోరాడు.

### ఉత్తరాధికారి నియామకం

స్వామిజీ ఆల్వాయ్ ఆశ్రమం చేరాడు. కొంత విశ్రాంతి పొందాడు. భక్తజనం మిక్కుటమయ్యారు. విశ్రాంతి సరిపోలేదు. అయినా తెల్లవారి తెల్లిచ్చేరి వెళ్ళి జగన్నాధ ఆలయంలో, వారానికి కొన్ని రోజులు పులయులకు ఆలయ ప్రవేశం ఏర్పాటు చేశాడు. తర్వాత శివగిరికి చేరాడు. తాను తలపెట్టిన "మాదిరి పాఠశాల"ను నిర్మాణం పూర్తి చేయాలనుకున్నాడు. అందుకు డబ్బులు కావాలి. విరాళాకై పకరణ పర్యటన ప్రారంభించాడు. క్విలోన్, కరుణగపల్లి, చిరయిన్‌కిజ్ తాలూకాలలో తిరిగాడు. శరీరానికి శ్రమ ఎక్కువైంది. అరివిప్పురం చేరాడు. అక్కడ నుండి శివగిరికి వెళ్లాడు. విరాళాలకై నెయ్యాటింకార్‌కి బయలుదేరాడు. దారిలో జబ్బుపడ్డాడు. వెంటనే

శివగిరికి తిరిగి వచ్చాడు. డా॥ ఎ.వి.యన్.పణిక్కర్ పరీక్షించి, మందులిచ్చి ప్రయాణాలు తగ్గించుకోమని గట్టిగా చెప్పాడు.

ఆ సమయంలో శివగిరి ఆశ్రమంలో 1925 విజయదశమినాడు ఒక కీలక సన్యాస స్వీకరణోత్సవసభ ఏర్పాటు చేయించాడు. బోధానంద స్వామికి కాషాయాంబరాలు సమర్పించాడు. ఆయనను ఆశ్రమ ఉత్తరాధికారిగా ప్రకటించాడు. సాయంత్రం బహిరంగసభలో భారీ కార్యక్రమానికి రూపురేఖలు తీర్చిదిద్దారు.

## బ్రహ్మవిద్యాలయం

శివగిరిలో బ్రహ్మవిద్యాలయం, శంకుస్థాపన స్వామి స్వయంగా (1925లో) చేశాడు. అదే సమయంలో ఉన్నతాధికారి ట్రావంకూర్ దివాన్ మిస్టర్ వాట్స్ శివగిరి దర్శించి స్వామిని కలుసుకున్నాడు. ఆశ్రమంలో పరియపిల్లలు మరియు అన్ని కులాలవారూ ఉన్నారని దివాన్‌కి తెలిపాడు.

1926లో స్వామి 70వ జన్మదిన ఉత్సవం మహాఘనంగా జరిపారు. ఆ తర్వాత అలేప్పిలో జరిగిన యస్.యన్.డి.పి యోగం ప్రతేక సమావేశంలో "దేశాభిమాని" టి.కే.మాధవన్‌ను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అతను "యోగం" కేరళ మారుమూలలకు వ్యాపించేటట్లు గొప్పకృషి చేశాడు. ఏ కమ్యూనిటీ కూడ ఆర్గనైజేషన్ లేకుండా శక్తి పుంజుకోలేదు. సంపద పొందలేదు. ఈ సూత్రంతో యోగం పనిచేస్తుందని ప్రకటించారు. ఏళువ అనేది కులం కాదు. మతం కాదు. కనుక ఎవరైనను యోగం సభ్యులు కావొచ్చని స్వామి సందేశం పంపాడు.

## రెండోసారి శ్రీలంకకు

శివగిరిలో ఒకసారి తీవ్రమైన గొడవలు పుట్టాయి. స్వామి వేదన జెంది ఆశ్రమం వదిలాడు. ఇక కేరళకే తిరిగి రానన్నంత బాధపడ్డాడు.



అప్పటికి 70వ జన్మదినం పూర్తి అయింది. దారిలో తామ్రపర్ణి నది ఒడ్డున 12 రోజులు గడిపాడు. కొన్ని రోజులు ఒంటరిగా మధురై సమీపాన అరణ్యంలో ఉన్నాడు. అపుడు అనేక చోట్లకు భక్తుల కోర్కెపై వెళ్ళాడు.

తాను 'కున్నకుడై' లో ఉండగా ఒక సంఘటన జరిగింది. అక్కడ పాతదైన వినాయకాలయం ఒకటుంది. ప్రజలు వర్షాలు లేక బాధ పడుతున్నారు. తాగునీళ్లకు కనాకష్టంగా ఉంది. తమబాధలు స్వామికి చెప్పుకున్నారు. "వర్షం పడితే వినాయక గుళ్లో కొబ్బరికాయలు కొడతాం" అని ఉత్సాహంగా ఒప్పుకున్నారు. కొద్దిసేపట్లో వానమొదలై ఆరోజంతా పడింది. ప్రజలు ఆశ్చర్యపడి వేలకొలది కొబ్బరికాయలు కొట్టారు. అప్పటి నుంచి గుడి కొత్తదైపోయింది. మధురైకి ఉత్తరాన తిరుపేపకం గ్రామం ఉంది. పక్కనే వైగై నది ఉంది. మకాం పెట్టడానికి మంచి ప్రదేశం. స్వామి అక్కడికి బయలుదేరాడు. వర్షంలో తడుస్తూ నడిచాడు. ఎద్దుబండి ఎక్కినాడు. చాలా ఇబ్బంది పడి నడిచి, చిన్న వినాయక ఆలయంలో తలదాచుకున్నాడు.

కారు ప్రయాణం వద్దని రైలు ప్రయాణం కొరకు పట్టుబట్టాడు. ఇంతలో శివగిరి (వర్కల) నుండి ఐ.కె. గోవిందదాస్, స్వామి గోవిందానంద, స్వామిని వెతుక్కుంటూ వచ్చారు. మధురైలో స్త్రీల సంక్షేమానికి ఒక సంస్థ స్థాపించమని ఒక పెద్దమనిషికి అప్పచెప్పాడు. స్వామి రామేశ్వరం చేరాడు. ఒక జమీందారు ఆశ్రయమిచ్చాడు. ఆ మీదట కోలంబో వెళ్లాలన్నాడు. వైక్కం సత్యాగ్రహం సందర్భంగా స్వామి ఆలయప్రవేశం చేయరాదనే వార్త చెవిన పడింది.

1926 అక్టోబరు 30 నాటికి స్వామి కొలంబో చేరాడు. హిందువులు, సింహళీయులు, తమిళులు, మలయాళీలు మరి ఎందరెందరో అన్ని కులాలవాళ్లు, ఇతరమతాల వాళ్లుకూడ స్టేషన్ వద్ద స్వామికి బ్రహ్మాండమైన

స్వాగతం పలికారు. తమిళులు స్వామిపేర రోజూ విందులు చేశారు. స్వామి కొలంబో, కేండి నగరాల్లో అనేక బౌద్ధ సంస్థలు పరిశీలించాడు. భిక్షువుల ధోరణులు అంతగా నచ్చలేదు. బౌద్ధ గ్రంథాలలో అనేక భాగాలను బ్రాహ్మణులు వ్రాసినట్లు గ్రహించాడు.

## శ్రీనారాయణ ధర్మసంఘం

ప్రసిద్ధ సమాజసేవకుడైన సి.వి.కుంజరామన్‌తో సంభాషిస్తూ హిందూమతం మంచిది కావాలంటే హిందువులు మారడమే కాదు, హిందూ మతం కూడా మారాలన్నాడు స్వామి. అయినా హిందూయిజమ్ అనే మతమే లేదన్నాడు.

ఇండియాలో నివసించే వారిని హిందువులన్నారు. అలాంటప్పుడు ఇండియాలో ఉన్న ఇతర మతాల వారిని కూడ అలాగే పిలవాలి కదా అని స్వామి చెప్పాడు. **మతం అంటే ధర్మం అని స్వామి ఒక సందర్భంగా తెల్పాడు.**

తాను స్థాపించిన విద్య–వైద్య–ఆశ్రమ–సేవాసంస్థలు, ఆశ్రమాలు మొదలగు వాటన్నింటి నిర్వహణాధికారం స్వామి బోధానందకు ఉండేటట్లు వీలునామా వ్రాశాడు (1927).

మానవాళికి సేవచేయడానికి కార్యకర్తల బృందం ఉండాలని స్వామి ఎప్పటి నుంచో భావిస్తున్నాడు. ఆ కార్యకర్తలు సన్యాసులై ఉండాలని కోరాడు. కనుక ఆ కార్యకర్తలతో “శ్రీ నారాయణ ధర్మసంఘం” స్థాపించి 1928లో రిజిష్టరు చేయించాడు.

## శివగిరి యాత్రాస్థలం – పంచనియమాలు

1928లో స్వామి వైక్కం వెళ్తూ కొట్టాయంలో మకాం చేశాడు. వల్లభశ్శేరి గోవిందన్ వైద్యార్ స్వామిని కలిశాడు. టి.కె.కిట్టన్ కూడ ఉన్నాడు.



వాళ్లతో చర్చించి శివగిరి పవిత్రప్రదేశం గాను, నూతన సంవత్సరదినం యాత్రాదినంగాను నిర్ణయించాడు. ప్రతి సంవత్సరం శివగిరిలో యాత్రికులతో పండుగ జరపాలి. గృహస్థులకు, తెల్లబట్టలు, సన్యాసులకు కాషాయం, శబరియాత్రికులకు నలుపు, శివగిరి యాత్రికులకు పసుపురంగు నిర్ణయించాడు. పదిరోజులపాటు పంచనియమాలు, బుద్ధుని పంచశీలలాగ పాటించాలన్నాడు. దేహపవిత్రత, ఆహార పవిత్రత, మనసుపవిత్రత, వాక్‌పవిత్రత, క్రియాపవిత్రత – ఇవి పంచనియమాలు. యాత్రోత్సవం నిరాడంబరంగా, నిశ్శబ్దంగా, నియమిత ఖర్చుతో జరగాలన్నాడు.

శివగిరి యాత్రోద్దేశం ఏమంటే, 1.విద్య 2.పరిశుభ్రత 3.పవిత్రత 4.సంఘ నిర్మాణం 5.వ్యవసాయం 6.వ్యాపారం 7.చేతిపనులు 8.సాంకేతిక శిక్షణ. ఈ అంశాలపై నిపుణులు ప్రసంగించాలి. యాత్రికులు క్రమశిక్షణతో, సావధానంగా వినాలి. నేర్చుకోవాలి, అభ్యసించాలి. విజయం సాధించాలి. దానివల్ల ప్రజలకు, దేశానికి సంపద చేకూరుతుంది. ఏళువాలు మాత్రమే కాదు, అన్ని కులాలవాళ్ళూ పురోభివృద్ధి చెందాలి. జీవితం ఆదర్శవంతం కావాలి. ఇదియే శివగిరి యాత్ర ప్రాధాన్యత, ప్రధానాశయం.

## అంతిమయాత్ర

పల్లత్తూరిత్తి మీదుగా స్వామి వైక్కం చేరాడు. బడలిక, అలసట ఆవరించాయి. కొద్దిరోజులు విశ్రాంతిగ ఉన్నాడు. పిదప ఆల్వాయె చేరాడు. ప్రయాణాలు లేవుగాని, అభిమానుల రద్దీ మాత్రం ఆగలేదు.

యస్.యన్.డి.పి. యోగం యొక్క ప్రగతి స్వామికి మిక్కిలి సంతోషం కల్గించింది. టి.కె.మాధవన్ ఆధ్వర్యంలో కొద్దికాలంలో 50 వేలమంది సభ్యులుచేరారు. నూటఎనిమిది నూతన శాఖలు వెలువడ్డాయి. కొట్టాయం సమావేశంలో స్వామి స్వయంగా తన నమోదు పత్రాలు అందించాడు.

ఇదే స్వామి చివరి బహిరంగ సమావేశం. తర్వాత స్వామి వైక్కం వద్ద వెల్లూర్ మాధవ్‌కు వెళ్లాడు. అప్పటికి ఆరోగ్యం క్షీణించింది. మూత్ర విసర్జన సాఫీగా జరగక మిక్కిలి బాధపడ్డాడు. ప్రసిద్ధుడైన పాల్పాట్ డాక్టరు, మద్రాసు నుంచి వచ్చిన పండాల డాక్టరు చికిత్స చేశారు. ప్రయోజనం లభించలేదు. నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ (ఐసియు)లో పెట్టారు. వెంటనే మద్రాసు తీసుకొని వెళ్లారు. అప్పటికి స్వామికి 72ఏళ్లు – ఫిబ్రవరి 28, 1928. నాటికి కొంత ఉపశమనం కలగగానే మార్చి రెండో వారంలో శివగిరికి తీసుకొచ్చారు. మూత్ర విసర్జన బాగానే జరిగింది. మూడవ వారంలో వ్యాధి తీవ్రమైంది. మూత్రరంధ్రం మూతబడింది. జ్వరం వచ్చింది. ఆయుర్వేద చికిత్స చేశారు. "వస్తి" చికిత్స కూడ చేశారు. స్వామి బలహీన పడ్డాడు. కొన్ని నెలల పర్యంతం రుగ్మత వేధించింది. తీవ్ర బ్రహ్మచర్యం వల్ల ఈ జబ్బు వచ్చిందేమోనని అనుకున్నాడు. భౌతిక బాధను దాటి ఆంతరిక శాంతివైపునకు మరలినాడు.

**అది సెప్టెంబరు 28, వర్షపుదినం**

మధ్యాహ్నానికి వర్షం వెలిసింది, సూర్యుడు వెలిగాడు. అస్తాచల ప్రశాంతత అంతటా అలముకొన్నది. "నేను శాంతి అనుభవిస్తున్నాను" అని స్వామి తేటగా, స్పష్టంగా ప్రక్కనున్న వారితో పలికాడు. దివ్యదశకం పఠించమన్నాడు. చివరి పద్యం చివరి భాగం పఠనం వినిపిస్తోంది. **"నీ ఘనతలో మమ్ము ఇప్పటికీ సముద్రమంత లోతుగా ఉండనిమ్ము"** సాంతం శాంతంగా విన్నాడు. నేత్ర ద్వయం మూసుకొన్నది. అది అంతరావలోకనం.

ఇక అంతే! అభిమానలోకం శోకసముద్రంలో మునిగిపోయింది.

**సమాప్తం**



# అనుబంధాలు

## నారాయణాద్వైతం

### 1. స్థూలసూక్ష్మాలు

దేహం మనసుల సమన్వయంతో మనిషి జీవనం సాగిస్తాడు. దేహానికి రూపం ఉంది. మనసుకు భావన ఉంది. ఒకటి కనబడుతుంది. మరొకటి కనపడదు. కణసముదాయం, కణం సూక్ష్మంగానూ, సూక్ష్మాతి సూక్ష్మంగానూ ఉంటుంది. అదీ కనబడదు. మనిషి స్థూలసూక్ష్మాలు రెండూ అనుభవిస్తాడు. భౌతికస్థితిలోని స్థూలం, మానసిక స్థితిలోని సూక్ష్మం అనుభూతిపరంగా ఒకటే. అసలు ఉండేది అనుభూతే. అది "ఏకమేవాద్వితీయం". ఈ రెండుస్థితులూ శ్రీనారాయణగురువు అర్థం చేసుకున్నట్లు తెలుస్తున్నది.

### 2. సగుణనిర్గుణాలు

కనపడేది సగుణం. కనబడనిది నిర్గుణం. సూక్ష్మాతి సూక్ష్మ స్థితిలో రెండూ ఒకటైపోతాయి. ఆ స్థితిలో "యద్దృశ్యం తన్నశ్యం." ఒకస్థితిలో ఉండి మరోస్థితిలో లేకపోవడం "మాయ". సూక్ష్మాతి సూక్ష్మస్థితిని "మూలం" అన్నారు. మూలంలో ఒకటే. కాని బాహ్యంలో వేరు కదా! మూలాన్ని "ఏకం సత్" అన్నారు. "విప్రా బహుధా వదంతి" అంటే ఆ సత్యాన్నే విప్రులు వివిధ విధాలుగా చెప్పారు. చెప్పడం రకరకాలు గాని, సత్యానికి రకరకాల దారులు అని కాదు. భౌతికాన్ని రకరకాలుగా చెప్పొచ్చు. సూక్ష్మతత్వం ఒకటే. చేతనస్థితి స్థూల–సూక్ష్మ – కారణ – తురీయములుగా సూక్ష్మీకరించ బడింది. శంకరులు వైశ్వానరుని సూక్ష్మంగా వర్ణించాడు; అది విశ్వ తేజస, ప్రజ్ఞ. అద్వైతం పూర్వాపరాలు రెండు కానిది, ఒకటైనది. ఇదే "అద్వైతం". ఇది ఉపనిషత్ భావన. బ్రహ్మ సూత్రాలలోను ఇదే భావన ఉంది. వేదాలలో ఉంది సగుణం, వేదాంతాలలో ఉంది నిర్గుణం.

బ్రహ్మసూత్ర కర్త వ్యాసుడు. దాన్ని గౌడపాదుడు వివరించాడు. శంకరుడు వ్యాఖ్యానించాడు. అయితే ఉపనిషత్, వేదవేదాంగాలను అంగీకరించని బుద్ధుడు తన అనుభూతిని "అద్వయం"గా పేర్కొన్నాడు. స్వీయానుభూతి పరంగా, మొట్ట మొదటిగా (శంకరుడికి ముందే) లోకానికి బాహాటంగా అద్వయ సిద్ధాంతం ప్రకటించింది బుద్ధుడే. "అద్వయం" నుండి "అద్వైతం" వెలువడింది అనడంలో అర్థం ఉంది.నారాయణగురు అద్వైతానుభూతి సూక్ష్మాతి సూక్ష్మమైంది.

## 3. అనుష్ఠానం

నారాయణగురుని అద్వైతానికి ప్రాతిపదిక ఏమిటి? శంకరుడు చెప్పి వదిలేశాడు. అది సమాజగతం కాలేదు. అతడు చెప్పింది నిర్గుణం, ఆచరించింది సగుణం. శంకరుడు చెప్పిందాన్ని నారాయణగురు గుణవంతం చేయడమే విశేషం. సిద్ధాంతాన్ని సమాజగతం చేశాడు. వ్యష్టి అనుభూతిని సమష్టి జేసేప్రయత్నమే నారాయణగురు అనుష్ఠాన వేదాంతం.

## 4. లోకమనేకం

లౌకిక దృష్టిలో ఒకటి కాదు, అనేకమున్నాయి. ప్రపంచం వివిధ రకాలు, వివిధ వస్తు మాయాజాలం (Diversity). మానవ వ్యవహారానికి సమాజం ఒక నమూనా. సమాజం సంకుచిత కులప్రాతిపదిక స్థాయిలో ఉన్నా, గురుస్వామి సూక్ష్మధ్యానానుభూతులు పొందాడు. తాను ఒక అఖండ స్థితిలో ఉండి. సమాజాన్ని దర్శించాడు. అంతరంగం అఖండంగా ఉన్నపుడు బాహ్యరంగం కూడ అఖండంగా దృష్టికొస్తుంది. బాహ్యవస్తువుల్లో, పరిస్థితుల్లో విభేదాలున్నా అవి అఖండదృష్టి గలవానికి సంఘర్షణ కలిగించవు. వాటి పనితీరు సహజంగా ఉంటుంది. విభిన్నదృష్టిలో బాహ్యవిషయాలకు వేరువేరు విలువలు ఆపాదించినపుడు సంఘర్షణ జనిస్తుంది. సంఘటనలకు విషయాదులకు పేర్లు పెట్టడం, వాటిలో అనేక అర్థాలు గోచరించడం



జరుగుతుంది. నామం నామమాత్రమైతే బాధలేదు. విశేష విలువలు, ఉచ్ఛనీచాలు, హెచ్చుతగ్గులు, విభజనలు సృష్టించినపుడే విభేదాలు పీడిస్తాయి. సమాజంలో కులాలు, వర్ణాలు, మతాలు అలాంటి పని చేస్తున్నాయని గురుస్వామి గుర్తించాడు. మానసికానుభూతి ఒకటైనపుడు భౌతిక సామాజికానుభూతి ఒకటి ఎందుకు కాకూడదు అని ప్రశ్నించాడు. బయటి విభజనలు, విలువలు కూలదోసి మానసికంగా మనుషులను ఏకం చేయడమే నారాయణ అద్వైతం.

**అందుకే 'ఒకే కులం. ఒకే మతం, ఒకే దైవం మానవాళికి'** అని ప్రబోధించాడు. తాను అలా బ్రతికాడు. తోటి సామాజికుల్ని అలా బ్రతకమన్నాడు. అవరోధాలు ఎదుర్కోవడమే అతని అద్వైతతత్త్వం. ఏదో ఒక కులం, మతం, దైవం తప్పక ఉండాలని కాదు. ఏకత్వ సూచనకు మధ్యే మార్గమది. సమాజం అతని ధ్యేయం.

## 5. శంకరుని పరిమితి

శంకరుడు అద్వైతాన్ని ఎంతవరకు చెప్పాడో, నారాయణ గురు అక్కడ నుంచి కొనసాగించాడు. శంకరుడు సైద్ధాంతిక వాది. కాశిలోని చండాలుని చేతిలో శంకరాద్వైతం విమర్శకు లోనయింది. సమాజంలో అద్వైతం ప్రవేశించలేదు. ఆచరణకు అందలేదు. వారణాశి అనుభవం తర్వాత కూడ అద్వైత పీఠాలలో ఇతర వర్గాలు ప్రవేశించలేదు. అయితే నారాయణగురు సంస్కరణలు కేరళ శంకరఅద్వైతపీఠాలను తాకలేదు. అలాగే వైష్ణవ పీఠాలలో సంస్కరణలు కొన్ని ప్రవేశించినా అచ్చటి విభేద ఆచరణను సరిచేయలేదు.

## 6. తత్త్వసిద్ధి

ఇంకాస్త లోతుగా తత్త్వచింతన చేయడానికి సావధానత, ఎఱుక, ప్రజ్ఞ అవసరం. ప్రజ్ఞా విశేషమున్నపుడు సూక్ష్మార్థం బోధపడుతుంది

తాత్త్వికావగాహన సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంటుంది. గురుస్వామి "దర్శనమాల" లోని దశాంశాలు ఈ విషయం తెల్పుతాయి:

**1. అధ్యారోపదర్శనం** – ఉపరితల చూపు; పైపైన చూడడం.

**2. అపవాద దర్శనం** – ఇది కాదనుకొనే చూపు; పైపైన చూసింది, ఎవరో చెప్పింది కాదనుకోడం.

**3. అసత్య దర్శనం** – ఇది సత్యం కాదను చూపు; అసలు సత్యం ఇది కాదనుకోడం.

**4. మాయ దర్శనం** – భ్రమతో కూడిన చూపు; ఒక దానిబదులు మరొకటి తెలియడం

**5. భావదర్శనం** – చేతనపు చూపు; కొంత ఉత్తేజం పొంది, సొంతభావనతో ఇది కావొచ్చు అనుకునే చూపు

**6. కర్మ దర్శనం** – క్రియాత్మక చూపు; ఆచరణ ద్వారా, వాస్తవికంగా చూడడం.

**7. జ్ఞాన దర్శనం** – ప్రజ్ఞతో కూడిన చూపు; ఇంకాస్త సూక్ష్మంగా మరింత లోతైన విషయం కొరకు చూసే చూపు

**8. భక్తి దర్శనం** – నమ్మకపు చూపు; తెలిసినవారు చెప్పేరన్న హామీతో చూసే చూపు

**9. యోగ దర్శనం** – సంయోగంతో కూడిన చూపు; వస్తువుతో, విషయంతో ఏకమై చూసే చూపు

**10. నిర్వాణ దర్శనం** – విమోచన (స్వేచ్ఛ కల్గించు) చూపు; మానసికమైన మలినాలు, ఘర్షణలు, అలజడులు, చలనాలు ఏ మాత్రం లేకుండా నిర్మలమైన స్థితి నుంచి చూడడం.



దర్శనమంటే చూపు, దృష్టి, అవగాహన, అనుభూతి, చూడబడేది– చూసే సత్త ఒకటి కావడం, ప్రత్యక్షంగా చూడడం మున్నగు అర్థాలు; భావార్థాలు ఉన్నాయి. సమ్యక్ దృష్టి అని చెప్పవచ్చు. ఈ దర్శనం వివిధ స్థాయిలలో జరుగుతుంది. సత్యదర్శనం, తత్ ప్రభావమే సరియైన జీవితం.

భౌతికదృష్టితో పైపైన చూసి ఇది సత్యం అయి ఉండదు అని తెలిసి, దాన్ని వదిలేయడం జరుగుతుంది. ఇది సత్యం కాదు అని ఒక విధంగా అనిపిస్తుంది. ఒక స్థాయిలో ఇది సత్యమా అని అనుమానం కల్గుతుంది. మళ్లీ సత్యమే అని భ్రమకల్గుతుంది. ఒక్కోరకం చూపువల్ల ఒక్కోరకం భావం కల్గుతుంది. మరో రకమైన దృష్టి సంపూర్ణ చేతన దశలో ఉంటుంది. అంటే అది మొత్తం చూడడం అన్నమాట. అనుభవాల కలగలుపులో ఒక రకమైన నిర్ధారణకు రావడం మరోస్థాయిలో జరుగుతుంది. దాన్ని బట్టి క్రియలు, జరుగుతాయి. ఈ దశలో గతంతోను, భవిష్యత్తుతోను పనిలేకుండా, వాద వివాదాలతో పనిలేకుండా చేతన (Intelligence, not intellect) పుడుతుంది. ప్రజ్ఞా దర్శనమవుతుంది. ఘనమైనభావం, గాంభీర్యం కమ్ముకుంటాయి. అపుడు అదే తానయిపోవడం, సంయోగం చెందడం జరుగుతుంది. అపుడు ఒకటే ఉంటుంది, రెండవది లేదు. అదే విమోచనదశ, సంపూర్ణ స్వేచ్ఛ, తురీయం, నిర్వాణం. ప్రతివిషయంలో, ప్రతివస్తువు పట్ల, ప్రతి జీవన అంశం గూర్చి ఇలాంటి సత్యదృష్టి అద్వైతస్థితి నిస్తుంది.

నారాయణగురు లో, బయలు రెండింటిని చూశాడు. రెంటిలో గల సత్యాసత్యాలను అరసి, సంగ్రహంగా చెప్పాడు. పది అంశాలు తీసు కున్నాడు; ఒక్కో అంశం ఒక్కో అధ్యాయంగా మలిచాడు. అధ్యాయానికి 10శ్లోకాల చొప్పున వ్రాశాడు. అద్వైతసారం, అతని అనుభవసారం, ఏకత్వభావనతో కూడిన మానవ సేవాదర్శనమైన "దర్శనమాల" లో రంగరించాడు.

"మానవాళికి ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం" అన్న సందేశం అద్వైతానుబంధ సూత్రమే. దానిలో ఏకత్వముంది, కేవలత్వముంది, సర్వజనీనత్వముంది.

### II. చమత్కార సంభాషణలు

ఒక భక్తుడు: ఆవు పాలు, మేకపాలు తాగుతున్నాం, ఆవుమాంసం, మేకమాంసం తింటే తప్పేంటి? అని అడిగాడు.

**స్వామి:** మీ తల్లి చనిపోయి వుంటే ఆమెను పాతిపెట్టేవా, తిన్నావా?

---

**సంప్రదాయకుడు:** గడ్డం చేసుకోవడం అభ్యంతరం కాదా!

**స్వామి:** ముద్దెందుకు కడుక్కుంటున్నావ్?

---

**ఒకరు:** భారతీయులందరూ ఉమ్మితే ఆంగ్లేయులందరు మునిగి చస్తారు
**స్వామి:** నిజమే, ఆంగ్లేయుని చూడగానే నోరెండిపోతుంది.

---

**ఒకరు:** విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు కావడానికి అంతకాలం పట్టిందేమి స్వామి?

**స్వామి:** బ్రాహ్మణుడికి క్షత్రియునికి మధ్య అంగుళం దూరమే ఉంది. అంగుళం దాటడానికి ఎంతోకాలం పడితే, మీటరు దూరంలో ఉన్న దిగువ కులాల కర్మను ఏమనాలి?

---

"నిజమైన సత్యాగ్రహినే విజయం వరిస్తుందంటే;మండుటెండలో తిండి లేకుండా బాధపడే పేదలను నిందించ పనిలేదు".

---



### II. అనుభవ ప్రబోధాలు

1. వివిధరీతుల్లో బహిర్గతంగా ప్రకాశిస్తూ ప్రపంచ నిర్మాణం చేస్తున్న దొక్కటే.
2. సంభవించే ప్రతిదాన్నీ గమనిస్తూ వెళ్ళే జ్యోతి ఉంది; అది అపరిచ్ఛిన్నంగా, యూనిటీగా ఉంది.
3. మార్గదర్శకమైన ఆ కాంతి నక్షత్రంతో ప్రతివ్యక్తి నిరంతర సంబంధంలో ఉండాలి.
4. స్వీయజ్ఞానంతో స్థిరత్వం పొందలేకపోతే, స్వస్వరూపం స్థితిలో తురీయస్థానమునుండి చలించని జ్ఞానితో సంబంధం పెట్టుకోవాలి.
5. క్రియాశీల హేతువులో లౌకిక అహంకారం తొలిగించుకోవచ్చు; ఆధ్యాత్మిక అహంకారం దివ్యకృపవల్ల గాని తొలగదు.
6. ఇప్పుడిక్కడ ప్రపంచరూపంలో కనిపించేది ఒకే ఒక ప్రధాన సత్యం. దానికి వేరైన సత్యమెద్దియులేదు. జ్ఞానికి ఈ ప్రపంచం మాయ వంటిది; దాన్ని మానవుడను సంధానము చేశాడు, శ్రేష్ఠమైన విలువలలో కూర్చాడు. పవిత్ర ఆత్మ దర్శనం విభిన్న నామరూపాల ద్వారా చేసుకోగలిగే సూక్ష్మదృష్టిని పొందాలి.

### IV. రచనారమ్యత

శ్రీ గురుస్వామికి రచనాశక్తి ఒక యోగంగా అబ్బింది. ఆయన కనపడే ప్రపంచాన్ని కనపడని ప్రపంచాన్ని ఏకంగా ఆకళింపు చేసుకొన్న ఘనుడు. సమంగా, సమన్వయంగా, సకలంగా, సూక్ష్మంగా, స్వతంత్రంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, తాను పొందిన అనుభూతులను ధారాపాతమైన తన రచనలో పొందుపరిచాడు.

### V. ప్రఖ్యాత ప్రశంసావాక్యాలు

I have never seen one who is spiritually
greater than Swami Narayana guru .. I shall
never forget that radiant face illumined
by the self effulgent light of divine glory
and those mystic eyes fixing their gaze
on a far remote point in the distant horizon

- Ravindranath Tagore

శ్రీ నారాయణగురు నిర్యాణానంతరము డా॥ బి.ఆర్. అంబేద్కర్ శివగిరి ఆశ్రమం దర్శించి ఇలా రాశాడు;

"ఎందరో వచ్చారు, ఎందరో వెళ్లారు. అస్పృశ్యతపై దుమ్ములేపారు. కాని ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ ఒక నారాయణగురు అస్పృశ్యతా నిర్మూలనంలో విజయం సాధించాడు." – డా॥ బి.ఆర్.అంబేద్కర్

### VI. 1. శ్రీనారాయణ గురుస్వామి రచనలు

సంస్కృతం – 19 (చిన్న చిన్న పుస్తకాలు. కొన్ని శ్లోకాలలో వివిధ అంశాలతో, స్తోత్రాలతో కూడినవి).

మలయాళం – 39 (పద్యాలు, వచనాలతో తాత్వికాంశాలపై)

తర్జుమాలు – 2 (1.సంస్కృతము నుండి మలయాళంలోకి, 2.32 తిరుక్కురల్ పద్యాలు తమిళం నుంచి మళయాలంలోకి)

తమిళం – 1 (దైవం గూర్చి)

ఇతరములు – 6 (పద్యాలు, స్తోత్రాలు, విడివిడి తర్జుమాలు)



### 2. శ్రీనారాయణ గురుస్వామిపై రచనలు

శ్రీనారాయణగురుపై ఇప్పటివరకు వివిధ భాషల్లో వెలువడిన పుస్తకాలు:

| | |
|---|---|
| మలయాళంలో పుస్తకాలు : | 3,000 |
| ఇంగ్లీషులో పుస్తకాలు : | 100 |
| తమిళంలో పుస్తకాలు : | 40 |
| కన్నడంలో పుస్తకాలు : | 25 |
| హిందీలో పుస్తకాలు : | 15 |
| తెలుగులో పుస్తకాలు : | 6 |
| బెంగాలీలో పుస్తకాలు : | 2 |
| సంస్కృతంలో పుస్తకాలు : | 2 |
| మరాఠిలో పుస్తకాలు : | 1 |
| ఫ్రెంచ్‌లో పుస్తకాలు : | 1 |

(కేరళ పరిశోధనా మిత్రుల ద్వారా సేకరించిన సమాచారం. సంస్కృతంలోనివి ఇంకా సేకరించాలి. జర్మన్, డచ్ భాషల్లో కూడ పుస్తకాలు వెలువడ్డాయి.)

### VII. ఆధారగ్రంథాలు


1. నారాయణ గురు (ఇంగ్లీషు) – యం.కె.సామూ; మలయాళంలో రాయగా, మాధవన్ అయ్యప్పన్ ఇంగ్లీషులోకి తర్జుమా; (భారతీయ విద్యాభవన్ 1978)
2. శ్రీ నారాయణ ధర్మ సంఘం, (జీవిత చరిత్ర), శివగిరి, 1983 శ్రీనారాయణగురు దర్శనమాల – డా॥ ఆర్.కరుణాకరన్ (ఇంగ్లీషు, సంస్కృతం)

3. శ్రీనారాయణ గురుపై ప్రసంగాలు - వివిధ వక్తలు

4. స్వయంగా, స్వామి తిరిగిన కేరళస్థలాలు, దర్శించి, సేకరించిన సమాచారం.

5. వివిధ ప్రతికల ద్వారా వచ్చిన వ్యాసాలు.

6. శ్రీనారాయణ స్మృతి - శ్రీనారాయణగురు రచన (సంస్కృతం, తెలుగు, సి.సీతాలక్ష్మీదేవి, డా॥ పి.యస్.మలేశ్, గురుధర్మ ప్రచారణ సభ, హైదరాబాద్, 2011).

7. కేరళసామాజిక తత్త్వవేత్త శ్రీనారాయణ గురు- సత్యబాయిశివదాస్, పి.ప్రభాకరరావు, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1999.